ANN తెలుగు

Follow: @ANNTELUGU

12-10-2026

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 260 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్

## దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితి



- సీజేఐని కలిసి ఫిర్యాదు చేస్తాం
- కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విమర్శలు

02

## గోదావరి కంటే ఎక్కువ అభిమానం చూపిస్తున్నారు



- అభిమానుల ప్రేమే నాకు ఇంజిన్‌లా పనిచేస్తోంది
- మెగాస్టార్ చిరంజీవి

02

## విజయవాడ ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలి



- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- దసరా సామాన్యుల పండుగలా జరగాలి, వీఐపీలదిగా కాదని స్పష్టం

02



కరీంనగర్‌లో ఉత్సాహంగా

## డాక్‌ఫిట్ ప్రీమియర్ లీగ్

- డాక్టర్ల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా గ్రావిటీ ఫార్మా వినూత్న కార్యక్రమం
- గ్రావిటీ ఫార్మా చొరవకు ప్రశంసలు

**కరీంనగర్, మహా :** నిత్యం ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించే వైద్యుల శారీరక దృఢత్వం, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత నిస్తూ గ్రావిటీ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్‌ఫిట్ ప్రీమియర్ లీగ్ కరీంనగర్‌లో అట్టహాసంగా మిగతా 2వ పేజీలో



## జిబౌటి తీరంలో ఘోర పడవ ప్రమాదం

**109 మంది మృతి, 116 మంది గల్లంతు**

**మహా :** ఆఫ్రికాలోని జిబౌటి తీరంలో అత్యంత హృదయవిదారకమైన పడవ ప్రమాదం చోటుచేసుకుంది. ఉపాధి వెతుక్కుంటూ అక్రమ మార్గంలో వలస వెళ్తున్న ప్రయాణికుల పడవ సముద్రంలో మునిగిపోవడంతో 109 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 116 మంది ఆచూకీ గల్లంతు కావడం తీవ్ర కలకలం రేపింది. మృతుల్లో చిన్నమొత్తంలో కాకుండా ఏకంగా 15 మంది చిన్నారులు ఉండటం అందరినీ మిగతా 2వ పేజీలో



# దేఖ్ లేంగే

## నేతలంతా ఛలో ఢిల్లీ



సుప్రీంకోర్టుకు మార్చ్‌గా తరలిరండి

## యువతకు రాహుల్ పిలుపు

- మనం సంఘటితంగా ఉంటే.. దేశద్రోహులు ఏం చేయలేరు
- తెలంగాణ నుండి తరలిని పీసీసీ చీఫ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, కీలకనేతలు
- గోవా నుండి నేరుగా ఢిల్లీకి సీఎం రేవంత్

**మహా నెట్ వర్క్ :** కాక్రోచ్ ల ఉద్యమం అణచామని సంబరపడ్డ కేంద్రానికి రాహుల్ గాంధీ షాకిచ్చారు. సుప్రీంకోర్టుకు మార్చ్‌గా తరలిరావాలని యువతకు పిలుపునివ్వడంతో.. నేడు ఢిల్లీ మరోసారి అట్టుడకనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపుమేరకు తెలంగాణకు చెందిన నేతలంతా ఢిల్లీ బాట పట్టారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ , ఎంపీ వేం నరేందర్ రెడ్డి సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్ ఛార్జిలు ఢిల్లీ వెళ్ళారు. గోవాలో జరిగిన కాంగ్రెస్ యాత్ర, సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి అక్కడి నుండి నేరుగా ఢిల్లీ వెళ్ళారు. యువతపై బీజేపీ గూండాలు భౌతిక దాడులు చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. సోమవారం సుప్రీంకోర్టుకు తరలిరావాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఒక వీడియోను ఆయన విడుదల చేశారు.

**యువతపై బీజేపీ గూండాల దాడి**

యువతపై బీజేపీ గూండాలు భౌతిక దాడులు చేస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ మిగతా 2వ పేజీలో





## గోవాను డ్రగ్స్ హబ్‌గా మార్చారు

మరోసారి బీజేపీ వస్తే గోవా సర్వనాశనమే

- నిప్పులు చెరిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రమోద్ సావంత్.. ప్రాపర్టీసావంత్ గా మారారని ఫైర్
- గోవాలోని ప్రభుత్వభూములన్నీ మింగేశారని ఆగ్రహం
- హైదరాబాద్ కు రవాణా అవుతున్న డ్రగ్స్ కూడా.. గోవా నుండే
- ఈసారి కాంగ్రెస్ నే గెలిపించాలని పిలుపు
- గోవాలో భారీ ప్రదర్శన.. సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

పనాజీ : గోవాలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో భూములు మిగలవని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ పాలనలో గోవా సర్వనాశనమైందని, రాష్ట్రాన్ని డ్రగ్స్ హబ్‌గా మార్చారని ఆరోపించారు. యువతకు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో చాలామంది డ్రగ్స్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా 'నషాముక్త్ భారత్' గురించి మాట్లాడుతున్నారని, అలాంటప్పుడు గోవాలో డ్రగ్స్ సమస్యను ఎందుకు అరికట్టడం లేదని ప్రశ్నించారు. గోవాలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ మహార్యాలీలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి అనంతరం జరిగిన సభలో ప్రసంగించారు. హైదరాబాద్‌కు రవాణా అవుతున్న డ్రగ్స్ కూడా గోవా నుంచే వస్తున్నాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. యువత భవిష్యత్తును కాపాడాలంటే నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంతో పాటు మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గోవా భూములను కాపాడుకోవాలని, అక్కడి సహజ వనరులు, ప్రజల ప్రయోజనాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. బీజేపీకి విభజన రాజకీయాలు అలవాటుగా మారాయని 2వ పేజీలో



## అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్

- తమిళనాడులో రూ.13 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోదీ
- మెట్రోపై సీఎం విజయ్ వినతులు

02

## నిరసనలు ఆపేది లేదు

- మళ్లీ వీధుల్లోకి వచ్చి పోరాడతాం
- అభిజీత్ దీప్కే

02



## రైతన్నలూ ఈసారి రబీ పంటలు సాగు చేయొద్దు

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం, మహా :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నందున రైతులు రబీ సీజన్‌లో రెండో పంటలు సాగు చేయకుండా సర్కారుకు సహకరించాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నదాతలకు సూచించారు. ఖమ్మం జిల్లా కుసుమంచిలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి యాసంగి పంటలపై రైతులకు పలు సూచనలిచ్చారు. ఇప్పటికే సాగు చేసిన మొదటి పంటను



ఎలాగోలా ప్రభుత్వం రక్షిస్తుందని మంత్రి పొంగులేటి భరోసా కల్పించారు. వర్షాలు లేకపోవడంతో నీటి లభ్యత లేదని, అలాగే విద్యుత్ కూడా అందుబాటులో లేనందున కొనుగోలు చేసే పరిస్థితి లేదని ఆయన వ్యాఖ్యానించారు. ఇక పేదలకు లబ్ధి చేకూర్చే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రభుత్వం కొనసాగిస్తుందని కూడా మంత్రి స్పష్టం చేశారు. కష్ట కాలంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని అన్నదాతలకు పొంగులేటి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నీరు, కరెంటును పొదుపుగా వినియోగించడం అందరి బాధ్యతగా మంత్రి స్పష్టం చేశారు.



## జర్నలిస్టుల సమస్యల కోసం ప్రెస్ క్లబ్ కార్యాచరణ ప్రణాళిక

02

## నానా పటేకర్‌ది సహజ మరణమే

పోస్ట్‌మార్టం నివేదికలో వెల్లడి

02






## దేఖ్ లేంగే

**మొదటి పేజీ తరువాయి**

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. సోమవారం సుప్రీంకోర్టుకు తరలిరావాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు ఒక వీడియోను ఆయన విడుదల చేశారు. సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్‌గా కాంగ్రెస్ ,ఇండియా కూటమి నేతలు తరలివెళ్తారని తెలిపారు. ‘‘యువకులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా, ఎటువంటి ద్వేషం లేకుండా, కేవలం ప్రేమతో వ్యక్తపరచాలనుకుంటున్నారు. కానీ, బీజేపీ గూండాలు, పోలీసులు వారిని అణచివేసి దాడులు చేశారు. భారత రాజ్యాంగాన్ని రక్షించడానికి, ప్రజాస్వామ్యాన్ని సమర్థించే ప్రతిఒక్కరూ ఎలాంటి రాజకీయ పార్టీలు, కుల మతాల భేదాలు లేకుండా సోమవారం సుప్రీంకోర్టుకు తరలిరావాలి’’ అని ఆయన కోరారు. ఓట్ల చోరీని అరికట్టడం, సివిల్ సర్వీసెస్ పరీక్షా విధానం (ఈఎస్ఐఆర్) లో సమస్యలను పరిష్కరించడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లను (ఈవీఎం) తొలగించడం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తొలగింపు వంటి డిమాండ్లపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌కు రేపు వినతిపత్రం అందజేయనున్నామని వెల్లడించారు. మనమంతా సంఘటితంగా ఉంటే దేశద్రోహులు ఎవరూ మనపై దాడి చేయలేరని అన్నారు. దేశ ప్రజలందరూ ప్రేమ, సోదరభావం, దేశభక్తితో ఐక్యంగా ఉండి, భయపడకుండా నిలబడితే ఇటువంటి అరాచక శక్తులు తలవంచక తప్పదని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.




# అతి పెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్

- తమిళనాడులో రూ.13 వేల కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించిన ప్రధాని మోదీ
- మెట్రోపై సీఎం విజయ్ వినతులు



**చెన్నై, మహా** : భారతదేశం పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్ అవతరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. 2014 నుంచి ఇప్పటివరకు దేశ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు ఏకంగా 11 రెట్లు పెరిగాయని ఆయన వెల్లడించారు. కేవలం మొబైల్స్ కాకుండా రక్షణ పరికరాల తయారీలోనూ దేశం స్వయం సమృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందని, తయారీ రంగం విస్తరణతో దేశంలోని యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ప్రధాని వివరించారు. తమిళనాడు రాష్ట్రంలో ఒకరోజు పర్యటనలో భాగంగా చెన్నైకి విచ్చేసిన ప్రధాని మోదీ.. రూ.13 వేల కోట్లకు పైగా విలువైన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ అన్ని విధాలుగా సహకరిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అండగా నిలుస్తామని తెలిపారు. దేశంలోని రాష్ట్రాలు ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందితేనే దేశం మరింత బలోపేతమవుతుందని ఆయన నొక్కిచెప్పారు.

**25 నగరాలకు విస్తరించిన మెట్రో సేవలు**

దేశంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణను ఒక సవాలుగా కాకుండా, భవిష్యత్తును మార్చే అవకాశంగా చూడాలని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. ఆధునిక నగరాల అభివృద్ధికి సురక్షితమైన, వేగవంతమైన ప్రజా రవాణా వ్యవస్థ అత్యంత కీలకమని చెప్పారు. 2014లో కేవలం 5 నగరాలకే పరిమితమైన మెట్రో రైలు సేవలు, నేడు దేశవ్యాప్తంగా 25 నగరాలకు విస్తరించాయని హర్షం వ్యక్తం చేశారు. దీనితో పాటు దేశవ్యాప్తంగా రహదారుల విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కాగా చెన్నైకు కనెక్ట్ అయ్యేలా రాష్ట్రంలోని వివిధ నగరాలకు మెట్రో సేవలు అందించాలని సీఎం విజయ్ కోరారు.

**చెన్నై మెట్రో రెండో దశ ప్రారంభం.. మెట్రోలో ప్రధాని ప్రయాణం**

చెన్నై మెట్రో ప్రాజెక్టు రెండో దశలో భాగంగా సుమారు రూ.4,900 కోట్ల వ్యయంతో అత్యాధునికంగా నిర్మించిన పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రితో కలిసి మెట్రో రైలులో ప్రయాణిస్తూ ప్రయాణికులతో ముచ్చటించారు. అంతకుముందు చెన్నై విమానాశ్రయంలో ప్రధానికి గవర్నర్, ముఖ్యమంత్రి సాదర స్వాగతం పలికారు. విమానాశ్రయం వెలుపల ఏర్పాటు చేసిన భారీ రోడ్‌షోలో ప్రధాని మోదీ పాల్గొని, దారి పొడవునా బారులు తీరిన ప్రజలు, కార్యకర్తలకు అభివాదం చేశారు. తమిళనాడులో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం పట్ల తన నిబద్ధత ఎప్పటికీ మారదని ప్రధాని స్పష్టం చేశారు. గూగుల్, డిజిటల్ ఇండియా నుంచి అంతరిక్ష రంగం వరకు అన్నింటా తమిళనాడు పాత్ర కీలకమని కొనియాడారు. గతంలో కరుణానిధి, జయలలితతో సహా పలువురు ముఖ్యమంత్రులతో కలిసి రాష్ట్ర అభివృద్ధి కోసం పని చేసిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి తమిళనాడులో తయారీ రంగం, పరిశ్రమలు, రవాణా వ్యవస్థలను మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.



# గోవాను డ్రగ్స్ హబ్ గా మార్చారు

**( మొదట పేజీ తరువాయి )**

రేవంత్‌రెడ్డి విమర్శించారు. గోవాలో ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ.. గతంలో ఒకసారి తప్పు జరిగిందని, మరోసారి కూడా జరిగిందని వ్యాఖ్యానించారు. 2027లో గోవాలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగం, డ్రగ్స్ సమస్యలు తొలగిపోవాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. ప్రజల భవిష్యత్తు, యువత ఉపాధి, రాష్ట్ర భూముల పరిరక్షణ కాంగ్రెస్ ప్రాధాన్యాలని తెలిపారు. బీజేపీని రావణుడితో పోలుస్తూ.. ఆ పార్టీని ఓడించాలంటే రాముడి లాంటి కాంగ్రెస్ అవసరమని వ్యాఖ్యానించారు. గోవా ప్రజలు బీజేపీ పాలనను గమనించి, రాబోయే ఎన్నికల్లో మార్పు దిశగా నిర్ణయం తీసుకోవాలని రేవంత్‌రెడ్డి కోరారు. బీజేపీ పాలనపై విమర్శలు గుప్పిస్తూ, గోవాను డ్రగ్స్ సమస్య నుంచి బయటపడేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోవా కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మాణిక్ ఠాకూర్, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



# గోదావరి కంటే ఎక్కువ అభిమానం చూపిస్తున్నారు

- అభిమానుల ప్రేమే నాకు ఇంజిన్‌లా పనిచేస్తోంది
- మెగాస్టార్ చిరంజీవి



**కపిలేశ్వరపురం, మహా :** గోదావరి జిల్లాల ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలు గోదావరి ప్రవాహాన్ని మించిపోయాయని మెగాస్టార్ చిరంజీవి భావోద్వేగంతో అన్నారు. అభిమానుల నుంచి లభిస్తున్న అపారమైన ప్రేమే తనకు నిత్యం కొత్త ఉత్సాహాన్ని ఇస్తోందని, వారి ఆదరాభిమానాలే తన జీవితానికి ఇంజిన్‌లా పనిచేస్తూ ముందుకు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలో జీఎస్ఎల్-సూర్య ఆరోగ్య కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వయసు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, అభిమానుల గుండెల్లోని స్థానమే తనకు నిత్య శక్తినిస్తోందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తన ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునే విధానాన్ని ప్రస్తావిస్తూ.. ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిపై తనకు ప్రత్యేక అభిమానం ఉందని, ఆయన సూచించే ఆరోగ్య నియమాలను తూచా తప్పకుండా పాటిస్తానని చెప్పారు. ఈ సభలో ఆరోగ్య రంగంపై పలు కీలక సూచనలు చేస్తూ.. క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని చిరంజీవి నొక్కిచెప్పారు. క్యాన్సర్ అనగానే భయపడిపోకుండా, ముందస్తు పరీక్షలు చేయించుకోవడం, నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పాన్ పరాగ్, గుట్కా వినియోగం, ధూమపానం వంటి హానికరమైన అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వాటిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేయడానికి మెరుగైన అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో గతంతో పోలిస్తే ప్రస్తుతం స్పష్టమైన మార్పు కనిపిస్తోందని చిరంజీవి అభిప్రాయపడ్డారు. తాను రాష్ట్రానికి వచ్చి చాలా రోజులైందని, ఇప్పుడు ప్రయాణిస్తున్న సమయంలో రహదారుల పరిస్థితిలో వచ్చిన తేటతెల్లమైన మార్పును స్వయంగా గమనించానని తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని, భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత మేలు జరగాలని, అందరికీ న్యాయం అందాలని మనసారా కోరుకుంటున్నట్లు ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ పనితీరును కూడా ఆయన ప్రస్తావిస్తూ.. గతంలో వెనుకబడిన ఈ శాఖ ప్రస్తుతం మొదటి స్థానానికి చేరుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర అభివృద్ధి వంటి సామాజిక అంశాలపై ఆయన చేసిన వ్యాప్తులు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



# కరీంనగర్‌లో ఉత్సాహంగా డాక్‌ఫిట్ ప్రీమియర్ లీగ్

**( మొదటి పేజీ తరువాయి )**

ప్రారంభమైంది. వైద్యులు తమ వృత్తిపరమైన విధుల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, వ్యక్తిగత ఆరోగ్యం, శారీరక దృఢత్వంపై కూడా దృష్టి సారించాలనే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గతంలో వరంగల్‌లో నిర్వహించిన డాక్‌ఫిట్ ప్రీమియర్ లీగ్‌కు విశేష స్పందన లభించడంతో, ఈ కార్యక్రమాన్ని తెలంగాణలోని అన్ని జిల్లాల్లో విస్తరిస్తూ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్‌లోని VJR మెమోరియల్ క్రికెట్ గ్రౌండ్‌లో ఈరోజు క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహించారు. ఈ లీగ్‌లో కరీంనగర్‌కు చెందిన పలువురు వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం నాలుగు జట్లుగా విడిపోయి క్రికెట్ మ్యాచ్‌లు ఆడుతూ ఉత్సాహంగా సందడి చేశారు. సాధారణంగా 24/7 ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు అందిస్తూ, రోగుల ఆరోగ్య సంరక్షణలో నిమగ్నమయ్యే వైద్యులు.. ఆట మైదానంలో మాత్రం క్రీడాకారులుగా మారి ఉల్లాసంగా గడిపారు. క్రికెట్ ఆడుతూ తమలోని క్రీడాస్ఫూర్తిని చాటడంతో పాటు, శారీరక దృఢత్వం ప్రాముఖ్యతను చాటిచెప్పారు. వైద్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన గ్రావిటీ ఫార్మా కంపెనీని ఈ సందర్భంగా పాల్గొన్న వైద్యులు అభినందించారు. వృత్తిపరమైన ఒత్తిళ్ల మధ్య వైద్యులు తమ ఆరోగ్యంపై దృష్టిసారించేందుకు డాక్‌ఫిట్ ప్రీమియర్ లీగ్ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కరీంనగర్ వైద్యులకు డాక్‌ఫిట్ ప్రీమియర్ లీగ్, గ్రావిటీ ఫార్మా కంపెనీ నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైద్యుల్లో ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందిస్తూ, క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించే లక్ష్యంతో భవిష్యత్తులోనూ ఈ లీగ్‌ను మరిన్ని జిల్లాల్లో నిర్వహించేందుకు నిర్వాహకులు ముందుకు సాగుతున్నారు. గ్రావిటీ నుండి కోటి, యశ్వంత్ కార్యక్రమానికి ఆర్గనైజర్లుగా వ్యవహరించారు. ఎఎన్ఎన్ మీడియా గ్రూప్ మీడియా పార్ట్‌నర్‌గా వ్యవహరించింది.






## దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితి

**సీజేఐని కలిసి ఫిర్యాదు చేస్తాం**
**కాంగ్రెస్ చీఫ్ ఖర్గే విమర్శలు**

**ఢిల్లీ, మహా :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ మరోసారి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. ఓట్ల చోరీ చేసేందుకు వీలుగా ఎన్నికల సంఘం (ఈసీ) స్వయం ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించింది. మోదీ, షా కలిసి దేశంలో ప్రజాస్వామ్య నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించింది. దేశంలో ప్రస్తుతం అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని విమర్శించింది. నిరసనకారులను అణచివేయడానికి ఢిల్లీలో ఏకంగా సుమారు 32,000 మంది పోలీసులను మోహరించారంటేనే, మోదీ ప్రభుత్వంలో ఎంతటి భయం దాగి ఉందో అర్థమవుతోందని ఎద్దేవా చేసింది. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే మోదీ సర్కార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు.

**ఈసీ వ్యవహారంపై సీజేఐకు లేఖ రాశాం**

ఈసీ నిర్ణయాలు, సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌పై ఎన్నికల కమిషనర్ల వ్యక్తం చేసిన అభ్యంతరాలను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు మల్లికార్జున ఖర్గే తెలిపారు. ఇప్పటికే ఈ వ్యవహారంపై సీజేఐకు లేఖ రాసినట్లు వివరించారు. సోమవారం సాయంత్రం రాహుల్ గాంధీ సహా ఇతర కీలక నేతలతో కలిసి సీజేఐను కలవనున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఖర్గే వెల్లడించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై ఖర్గే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# విజయవాడ ఉత్సవాలను గ్రాండ్ సక్సెస్ చేయాలి




**విజయవాడ, మహా** : విజయవాడలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, త్వరలో ప్రారంభం కానున్న జాతీయ స్థాయి సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్ 2.0లను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ భారీ కార్యక్రమాల విజయానికి దేవాదాయ, పర్యాటక శాఖలతో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. మంత్రులు, ఉన్నతాధికారులతో శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. దసరా ఉత్సవాలు సామాన్యుల పండుగలా జరగాలని, వీఐపీల కోసం కాదని సీఎం స్పష్టం చేశారు. "ఇంద్రకీలాద్రి ఉత్సవాలు సామాన్యుల దసరాగా ఉండాలి, వీఐపీల దసరాగా కాదు. దీనికి అన్ని వర్గాలు సహకరించాలి" అని ఆయన అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో, వారి రాక వల్ల సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సూచించారు. వీఐపీల రాకతో విధించే ట్రాఫిక్ ఆంక్షల గురించి ప్రజలకు ముందుగా తెలియజేయాలని, వారి ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని దిశానిర్దేశం చేశారు. అక్టోబర్ 13 నుంచి 31 వరకు పున్నమి ఘాట్‌లో నిర్వహించనున్న 'జాతీయ సరస్ మేళా2026' దేశానికే ఆదర్శంగా నిలవాలని సీఎం ఆకాంక్షించారు. ఈ మేళాకు, దుర్గమ్మ దర్శనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మ హాజరవుతున్న నేపథ్యంలో ఆమె పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. దేశవ్యాప్తంగా ఉన్న మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన కోసం 576 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, అందులో 208 స్టాళ్లు ఏపీకి చెందినవని అధికారులు వివరించారు. మన రాష్ట్ర మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను 'స్వయం ఏపీ' బ్రాండ్ కింద జాతీయ స్థాయిలో ప్రదర్శించి, విక్రయించేందుకు ఈ మేళా గొప్ప వేదిక కావాలని సీఎం అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0'ను కూడా ఘనంగా నిర్వహించాలని చంద్రబాబు చెప్పారు. మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా, ప్రజల భాగస్వామ్యంతో ఈ ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ఈ వరుస కార్యక్రమాల వల్ల భక్తులు, పర్యాటకుల రాకతో ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్, కొండపల్లి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నిరసనలు ఆపేది లేదు

- మళ్లీ వీధుల్లోకి వచ్చి పోరాడతాం
- అభిజీత్ దీప్కే

**ఢిల్లీ:** సర్ ప్రక్రియలో అక్రమాల ఆరోపణల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాలు సహా కాక్రోచ్ జనతా పార్టీ నేతలు కూడా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే అక్టోబర్ 10న ఢిల్లీలో జరిగిన జంతర్ మంతర్ 2.O. నిరసనల నేపథ్యంలో అరెస్ట్ అయిన సీజేపీ నేతలు ఆదివారం విడుదలయ్యారు. విడుదల అనంతరం సీజేపీ వ్యవస్థాపకులు అభిజీత్ దీప్కే మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యక్తిగత విషాదాలు, రాజకీయ ఒత్తిళ్లు తమ ఉద్యమాన్ని ఆపలేవని స్పష్టం చేశారు. నిరసనలను కొనసాగిస్తామని, మళ్లీ వీధుల్లోకి వస్తామని ప్రకటించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తొలగింపును కోరుతూ ఇకపై నిరసనలు చేపట్టబోమని తెలిపే ఎలాంటి బాండ్లపై తాము లేదా ఇతర సీజేపీ నాయకులు సంతకం చేయలేదని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

## జిబౌటి తీరంలో ఘోర పడవ ప్రమాదం

**( మొదటి పేజీ తరువాయి )**

కంటతడి పెట్టిస్తోంది. అంతర్జాతీయ వలస సంస్థ (IOM) వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబరు 8, 9 తేదీల మధ్య రాత్రి సమయంలో జిబౌటిలోని ఒబోక్ పట్టణానికి సమీపంలో ఈ దుర్ఘటన సంభవించింది. మొత్తం 350 మంది వలసదారులతో ఒక పడవ జిబౌటి నుంచి యెమెన్ వైపు ప్రయాణం ప్రారంభించింది. ఒబోక్ తీరానికి ఉత్తరంగా సముద్రంలో వెళ్తుండగా ఓవర్‌లోడ్ మరియు ప్రతికూల పరిస్థితుల కారణంగా పడవ ఒక్కసారిగా బోల్తా పడి నీట మునిగింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే స్థానిక అధికార యంత్రాంగం, అంతర్జాతీయ వలస సంస్థ సిబ్బంది రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన 109 మంది మృతదేహాలను సహాయక సిబ్బంది వెలికితీశారు. వీరిలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు (9 మంది బాలికలు, 6 మంది బాలురు) ఉన్నట్లు ఐఓఎం స్పష్టం చేసింది. కాగా, ఈ ప్రమాదం నుంచి అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడిన 80 మందికి పైగా క్షతగాత్రులంతా ఇథియోపియా దేశానికి చెందినవారే కావడం గమనార్హం. ఆఫ్రికా దేశాల్లో నెలకొన్న తీవ్ర పేదరికం, అంతర్గత అభద్రత, ఉపాధి అవకాశాలు లేకపోవడం, వాతావరణ మార్పుల ప్రభావంతో గల్ఫ్ దేశాలకు చేరుకుని బతుకు బండి లాగాలని భావిస్తున్న నిరుపేదలు ఇలాంటి ప్రమాదకర సముద్ర మార్గాలను ఆశ్రయిస్తున్నారు. జిబౌటి నుంచి ప్రమాదకరమైన 'బాబ్ ఎల్ మండెబ్' జలసంధి మీదుగా యెమెన్‌కు చేరుకుని, అక్కడి నుంచి ఇతర గల్ఫ్ దేశాలకు వలస వెళ్లాలని ప్రయత్నించడం పరిపాటిగా మారింది. అయితే, దలారీల మోసాలు, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్ల ఇలాంటి పడవ ప్రమాదాలు తరచూ జరుగుతుండటంతో వలసదారుల కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంటోంది. ప్రస్తుతం సముద్రంలో గల్లంతైన మరో 116 మంది కోసం జిబౌటి అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.





# అంగరంగ వైభవంగా దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభం

- ఉత్సవాలను ప్రారంభించిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని

**వరంగల్, మహా** : వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శ్రీ భద్రకాళీ దేవీ శరన్నవరాత్ర దసరా మహోత్సవాలు అత్యంత వైభవోపేతంగా ప్రారంభింపబడ్డాయి. ఉదయం 400 గంటలకు నిత్యాహ్నికం నిర్వర్తించిన పిమ్మట అర్చకులు అమ్మవారికి ఉత్సవానుజ్ఞ ప్రార్ధన జరిపారు. అమ్మవారు అనుగ్రహించిందన్న సూచన రాగానే గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించిన పిమ్మట అమ్మవారికి పూర్ణాభిషేకం నిర్వహించారు. పంచామృతాలు, పంచోదకాలు, ఔషదులు, వృక్షపల్లవ కషాయాలు వంటి సుగంధ ద్రవ్యాలు ఇత్యాది పలు విధములైన వస్తు సంభారములతో రెండు గంటల పాటు సాగిన ఈ అమ్మవారి అభిషేకం భక్తులకు అమితమైన అనందాన్ని కలిగించింది. అనంతరం నవరాత్రులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ ఈ ఓ రామల సునీత, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త డాక్టర్ బి. శివసుబ్రహ్మణ్యం, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆదివారం భేరీపూజ జరిపిన అనంతరం ఉత్సవాల ధ్వజారోహణం జరిపారు. అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించి ఆరాధించిన పిమ్మట నవరాత్ర యాగంలో మొదటి రోజుకు విహితమైన వరాహ పురాణాంతర్గత నవదుర్గా క్రమాన్ని అనుసరించి అమ్మవారికి ఉదయం శైలపుత్రీ క్రమంలోనూ సాయంకాలం బోధాయనోక్త వైదికాగమ సూత్రాన్ననుసరించి సాయంకాలం యోగనిద్రా దుర్గా క్రమంలో విశిష్ట పూజాలు జరిపి ఉదయం అమ్మవారిని వృషభ వాహనం మీద సాయంకాలం మృగవాహనం పై ఊరేగించారు. నవరాత్రులలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేద పారాయణం, మాన్యుసూక్త సహస్రావర్తన పురస్సర మారుతి యాగం, శతచండీ యాగం, మహారుద్రయాగం, గణేశ యాగం, సుదర్శన యాగం, సౌరయాగం, మహాలక్ష్మీయాగం, దశమహావిద్య యాగం, దుర్గా యాగం, సరస్వతీ యాగం నిర్వహించుటకు దాతల చే యాగ సంకల్పం చేయించి యాగములు ప్రారంభించారు. అనంతరం సాయంకాలం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయి. ఆదివారం అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవీ కుటుంబ సమేతంగా దర్శించు కోగా పలువురు న్యాయమూర్తులు కూడా దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రతినిత్యం నిర్వహించే అన్నదానం గూర్చి హైదరాబాద్ వాస్తవ్యులు పొన్నలూరి వెంకట సుబ్రహ్మణ్యం రాజ్యలక్ష్మి దంపతులు సుమారు రూ. 150,000 లక్షల వ్యయంతో వంట పాత్రలు దేవస్థానానికి ఈవో రామల సునీత సమక్షంలో అందజేశారు.

# 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ లక్ష్యం

- ప్రైవేట్ రంగం నుంచి రూ.7.5 లక్షల కోట్ల పెట్టుబడులు.
- అణుశక్తి కమిషన్ చైర్మన్ అజిత్ కుమార్ మొహంతి.



**న్యూఢిల్లీ, మహా** : భారతదేశంలో హరిత ఇంధన రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. దేశంలో అణు విద్యుత్ ఉత్పత్తిని భారీస్థాయిలో విస్తరించాలని నిర్ణయించినట్లు అణుశక్తి కమిషన్ చైర్మన్ అజిత్ కుమార్ మొహంతి వెల్లడించారు. స్వాతంత్ర్య శతాబ్ది సంవత్సరమైన 2047 నాటికి దేశంలో 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ బృహత్తర లక్ష్య సాధనలో ప్రైవేట్ రంగాన్ని కూడా పెద్దఎత్తున భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు.

అణు విద్యుత్ రంగంలోకి ప్రైవేట్ సంస్థలను ఆహ్వానించడం ద్వారా సుమారు రూ.7.5 లక్షల కోట్ల మేర భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అజిత్ కుమార్ మొహంతి అంచనా వేశారు. ఈ ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా 2047 నాటికి సుమారు 30 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం దేశంలో అణు విద్యుత్ స్థాపిత సామర్థ్యం దాదాపు 9 గిగావాట్లుగా ఉంది. ప్రభుత్వ రంగ సంస్థ అయిన న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 24 రియాక్టర్లను నిర్వహిస్తుండగా, మరో 17 రియాక్టర్ల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోంది. అణు విద్యుత్ రంగంలో ప్రైవేట్ సంస్థల ప్రవేశానికి వీలుగా ప్రభుత్వం ఇప్పటికే తగిన చట్టపరమైన సవరణలు తెచ్చిందని మొహంతి తెలిపారు. రాబోయే ఐదేళ్ల కాలంలో ఒకటి లేదా రెండు ప్రముఖ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు అణు రియాక్టర్ల నిర్వహణ రంగంలోకి అడుగుపెట్టే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాధారణంగా ఒక మెగావాట్ అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏర్పాటు చేసేందుకు సుమారు రూ.25 కోట్ల వ్యయం అవుతుందని ఆయన వివరించారు.

భారీ పరిశ్రమలైన ఉక్కు, సిమెంట్ వంటి రంగాలకు నిరంతరంగా, స్వచ్ఛమైన విద్యుత్‌ను అందించేందుకు చిన్న మాడ్యులర్ అణు రియాక్టర్ల వినియోగంపై ప్రభుత్వం గట్టిగా పరిశీలిస్తోంది. తక్కువ కార్బన్ ఉద్గారాలతో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంలో అణుశక్తి కీలకపాత్ర పోషిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు, దేశీయంగా సమృద్ధిగా లభించే థోరియం వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి భారత్ ప్రత్యేకంగా మూడంచెల అణు విద్యుత్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మొదటి దశలో యురేనియంను ఇంధనంగా వాడే రియాక్టర్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ, ఉప ఉత్పత్తులుగా ప్లూటోనియం239ను పొందుతారు; వాడిన అణు ఇంధనాన్ని రీసైక్లింగ్ చేయడం ద్వారా ప్లూటోనియంను తిరిగి వెలికితీస్తారు. రెండో దశలో ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లలో ఈ పదార్థాన్ని ఉపయోగించి అదనపు విచ్ఛిన్న పదార్థాలను ఉత్పత్తి చేస్తారు. మూడో దశలో దేశంలో విరివిగా లభించే థోరియంను అణు ఇంధనంగా మార్చి వాడుకోవడం దీని ప్రధాన లక్ష్యం.

భారతదేశంలోని ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు సముద్ర తీర ప్రాంతాల్లో మోనజైట్ ఖనిజం కలిగిన ఇసుక నిక్షేపాలు భారీగా ఉన్నాయి. వీటి నుంచి థోరియంను సులభంగా వెలికితీసే అవకాశం ఉంది. ఈ దేశీయ వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా భారత్ దీర్ఘకాలిక ఇంధన భద్రతను సాధించవచ్చని శాస్త్రవేత్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, తమిళనాడులోని కల్పక్కంలో పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ అత్యంత కీలకమైన దశకు చేరుకుంది. ఇది వాణిజ్య స్థాయిలో అందుబాటులోకి వస్తే అణు విద్యుత్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి మరింత బలపడుతుంది. 1969లో ప్రారంభమైన మన దేశ వాణిజ్య అణు విద్యుత్ ప్రయాణం.. రియాక్టర్ల రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో అసాధారణ నైపుణ్యాన్ని సాధించింది. రాబోయే కాలంలో ప్రైవేట్ పెట్టుబడులు, అత్యాధునిక సాంకేతిక పురోగతి, దేశీయ థోరియం వనరుల వినియోగం భారత్‌ను అణు విద్యుత్ రంగంలో తిరుగులేని శక్తిగా నిలపడంలో కీలకపాత్ర పోషించనున్నాయి.



# నానా పటేకర్‌ది సహజ మరణమే

**పోస్ట్‌మార్టం నివేదికలో వెల్లడి**

**ముంబై :** ప్రముఖ నటుడు నానా పటేకర్ మరణం సహజమైనదేనని, గుండెపోటు వల్లే ఆయన కన్ను మూశారని గోవా వైద్యకళాశాల పోస్ట్‌మార్టం నివేదికలో వెల్లడైంది. గుండెకు రక్తాన్ని సరఫరాచేసే ఎడమ ప్రధాన ధమనిలో రక్తం గడ్డకట్టడంతో ఆయనకు తీవ్రమైన గుండెపోటు వచ్చిందని వైద్యులు ధ్రువీకరించారు. అక్టోబర్ 8 తెల్లవారుజామున పనాజీ సమీపంలోని డోనా పౌలాలోని తన నివాసంలో 75 ఏళ్ల నానా పటేకర్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కేర్‌టేకర్ అంబులెన్స్‌లో సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. 45 నిమిషాల పాటు సీపీఆర్ చేసి ప్రయత్నించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆస్పత్రికి తరలించేటప్పటికే నానా మృతిచెంది ఉండటంతో వైద్యులు చట్టప్రకారం మెడికోలీగల్ కేసుగా ప్రకటించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వైద్యులు అసహజ మరణంగా కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో ఆయన మరణం సహజమైందేనని తాజాగా స్పష్టమైంది. "నానా పటేకర్‌ను ఆసుపత్రికి తీసుకువచ్చిన తర్వాత, ఆయనకు 45 నిమిషాల పాటు కార్డియోపల్మోనరీ రీససిటేషన్ చేశాం. అయినప్పటికీ ఆయనను బతికించలేకపోయాం. గుండె పోటు కారణంగా ఆయన ఉదయం 5.10 గంటలకు మరణించారు. ఆ తర్వాత ఆయన పార్థివ దేహాన్ని పోస్ట్‌మార్టం కోసం జీఎంసీహెచ్‌కు తరలించారు" అని గోవా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (జీఎంసీహెచ్)కు చెందిన ఓ సీనియర్ వైద్యుడు చెప్పారు.



# వరంగల్ లో ట్రాఫిక్ అస్తవ్యస్తం

- పండుగ వేళ ప్రజల తిప్పలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- అక్రమ వసూళ్ల పై ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణ పై లేదా?

వరంగల్, బ్యూరో మహా ; వరంగల్ నగరంలో ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా తయారైంది. పండుగల వేళ ప్రజలు షాపింగ్ కు వస్తే వాహనదారులు ట్రాఫిక్ జామ్ లో చిక్కుకుని తిప్పలు పడుతున్నామని చెబుతున్నారు. రోడ్ల పై ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాల్సిన అధికారులు ఎక్కడున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పండుగ సీజన్.. వరంగల్ నగరమంతా షాపింగ్ సందడిగా ఉంది. కానీ రోడ్డు ఎక్కితే మాత్రం నరకం కనిపిస్తోంది. మీరు చూస్తున్న ఈ దృశ్యాలు వరంగల్ నగరంలోని ప్రధాన కూడళ్లలో నిత్యం కనిపించే దృశ్యాలే. *రోడ్డు పైనే విచ్చలవిడిగా ఆటోల పార్కింగ్ వరంగల్ లో ఆటోలు రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేస్తూ ప్రయాణికుల కోసం ఎక్కడపడితే అక్కడ ఆపేసి ప్రయాణికులను ఎక్కించుకోవడం ముఖ్యంగా ట్రాఫిక్ రూల్స్ పాటించక పోవడమే కారణమని ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా ప్రధాన రోడ్ల పై ఉన్న దుకాణ సముదాయాల ముందర అడ్డగోలుగా వాహనాలను పార్కింగ్ చేయడం దీంతో వాహనదారులు ట్రాఫిక్ జామ్ లో చిక్కుకు పోతున్నారు. ఆఫీస్ లకు, ఇతర కార్యకలాపాలకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పండుగల వేళ నగరంలో రద్దీ మరింత పెరిగింది. వరంగల్ చౌరస్తా, ఆర్ఎస్టీ రోడ్డు, స్టేషన్ రోడ్డు , బట్టల బజార్ లాంటి ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ తో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంబులెన్స్ లు కూడా ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. కానీ ఈ ట్రాఫిక్ ను కంట్రోల్ చేయాల్సిన ట్రాఫిక్ అధికారి పర్యవేక్షణ ఎక్కడా కనిపించడం లేదు. రోడ్ల పై ట్రాఫిక్ కానిస్టేబుళ్లు కూడా కరువయ్యారు. కేవలం అక్రమ వసూళ్లు, అలాగే చలాన్లు విధించడం లో ఉన్న శ్రద్ధ ట్రాఫిక్ నియంత్రణ పై లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అధికారులకు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు పాటించని ఆటోల పై ఎటువంటి చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా వరంగల్ పోలీస్ కమిషనర్, సంబంధిత ఉన్నత అధికారులు జోక్యం చేసుకుని వరంగల్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి సత్తా చాటాలి.

- కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలి.
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



రంపచోడవరం, మహా. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించి సత్తా చాటాలని జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. కూటమి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలంతా అత్యంత సమన్వయంతో క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు.రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో జనసైనికులు, వీరమహిళలు ఎన్నో త్యాగాలు చేశారని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. వ్యక్తిగత పదవులు, రాజకీయ ప్రయోజనాలను ఆశించకుండా కూటమి విజయం కోసం నిస్వార్థంగా శ్రమించారని కొనియాడారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పొత్తు ధర్మాన్ని పూర్తిగా గౌరవిస్తూ, జనసేన నాయకులకు, కార్యకర్తలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కాకవాడలో 'అడవితల్లి బాట 2.0' కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు ఏవైనా సరే తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమిగా ఐక్యంగా ముందుకు సాగాలని, స్థానిక పరిస్థితులను బేరీజు వేసుకుంటూ ప్రజలతో మమేకమై కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి మరింత వేగంగా ముందుకు సాగాలంటే స్థానిక సంస్థల్లోనూ కూటమి బలపడాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు.

# స్థానిక ఎన్నికలకు టీడీపీ సమర సన్నాహాలు

**కూటమి సమన్వయం, ప్రచార వ్యూహంపై చంద్రబాబు దిశానిర్దేశం.**

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే ప్రక్రియను అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరింత వేగవంతం చేశారు. ఇందులో భాగంగా ఆదివారం ఆయన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, అబ్జర్వర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు మరియు ఇతర ముఖ్య నేతలతో ఉన్నత స్థాయి వర్చువల్ సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన రాజకీయ వ్యూహం, విస్తృత ప్రచార కార్యక్రమాలు, కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య క్షేత్రస్థాయిలో ఉండాల్సిన సమన్వయంపై నేతలకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాబోయే స్థానిక ఎన్నికలను పార్టీ శ్రేణులన్నీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన ఓట్ల శాతాన్ని మించి స్థానిక ఎన్నికల్లో ప్రభావితం చూపాలని లక్ష్యంగా నిర్దేశించారు. రాబోయే 50 రోజులపాటు నేతలందరూ సర్వశక్తులు ఒడ్డి గెలుపే ధ్యేయంగా పనిచేయాలని స్పష్టం చేశారు. నాయకుల పనితీరు, నిజాయితీ, ప్రజల్లో వారికున్న సమర్థతను ప్రాతిపదికగా తీసుకునే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఉంటుందని, క్షేత్రస్థాయిలో నేతల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని ఆయన హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు అత్యంత ప్రాధాన్యం కల్పించాలని టీడీపీ గట్టి పట్టుదలతో ఉంది. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫారసులను ప్రభుత్వం ఆమోదించిన నేపథ్యంలో, చట్టపరంగా సాధ్యమైన మేరకు బీసీలకు 34 శాతానికి మించి స్థానాలు కేటాయించడంతో పాటు, పార్టీ పరంగా సుమారు 40 శాతం సీట్లు బీసీలకే ఇచ్చేలా పక్కాగా కసరత్తు చేస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. 'జయహో బీసీ.. జనాభాలో సగం – కూటమి ఇచ్చింది బలం' అనే శక్తిమంతమైన నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేపట్టాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు.తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నేతలు క్షేత్రస్థాయి వరకు ఎలాంటి అపోహలకు తావులేకుండా అత్యంత సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్థానిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక, ప్రచార కార్యక్రమాల రూపకల్పనలో పరస్పర సంప్రదింపులు జరపాలని సూచించారు. భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలు రాకుండా సమష్టిగా ముందుకు సాగాలని, ప్రత్యర్థి పార్టీల నుంచి వచ్చే తప్పుడు విమర్శలు, దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు వాస్తవాలతో తిప్పికొట్టాలని కోరారు.




# జర్నలిస్టు చేతిలో సూపర్ పవర్.. ఏఐ!

తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ టీటీడీసీలో నిర్వహించిన జిల్లా జర్నలిస్టుల రెండు రోజుల శిక్షణ తరగతుల్లో పాల్గొని ఆధునిక జర్నలిజంలో ఏఐ టూల్స్ వినియోగం, ఫేక్ న్యూస్ గుర్తింపు, ఫ్యాక్ట్ చెకింగ్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ అందించాను. ఏఐ మన పనిని వేగవంతం చేయగలదు. సమాచారాన్ని విశ్లేషించడంలో సహాయపడగలదు. కానీ ఇదే సమయంలో ఫేక్ న్యూస్, డీప్‌ఫేక్‌లను గుర్తించడంతో పాటు వార్తల విశ్వసనీయతను కాపాడటం, వాస్తవాలను నిర్ధారించడం, జర్నలిజం నైతిక విలువలను పాటించడం.. వంటి అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చాను. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి గారికి, సెక్రటరీ వెంకటేశ్వరరావు గారికి, ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా గారికి, నిర్వాహకులకు, పాల్గొన్న జర్నలిస్టు మిత్రులందరికీ ధన్యవాదాలు. సాంకేతికత మారుతుంది.. జర్నలిజం రూపం మారుతుంది.. కానీ వాస్తవాల పట్ల నిబద్ధత ఎప్పటికీ మారకూడదు!

# రంజిత్ వైన్స్‌కు ప్రధాన రోడ్డే పార్కింగ్..!

- వైన్స్ కు పార్కింగ్ సదుపాయం లేక రోడ్డు పైనే వాహనాలురోజూ వాహనదారులు, పాదచారులకు నరకయాతన*
- ప్రధాన రహదారి పై ట్రాఫిక్ జామ్ పట్టించుకోని అధికారులు
- మామూళ్లు మత్తులో ట్రాఫిక్, ఎక్సైజ్ అధికారులు

హనుమకొండ, మహా ; హనుమకొండ లోని కేయూసీ రోడ్డు హనుమాన్ నగర్ రంజిత్ వైన్స్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తారాస్థాయికి చేరాయి. పార్కింగ్ సదుపాయం లేకుండా వైన్స్ నిర్వహిస్తుండటంతో ప్రధాన రహదారే పార్కింగ్ స్థలంగా మారింది. రోజూ వందలాది వాహనాలు రోడ్డుపైనే నిలపడంతో వాహనదారులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. అయినా ట్రాఫిక్, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హనుమకొండలోని హనుమాన్ నగర్ ప్రధాన రహదారిలో ఉన్న రంజిత్ వైన్స్... ఇప్పుడు ట్రాఫిక్ జామ్ కు ప్రధాన కేంద్రంగా మారింది. నిబంధనల ప్రకారం ఏ వైన్స్ షాప్ కైనా తప్పనిసరిగా పార్కింగ్ స్థలం ఉండాలి. కానీ నగరంలో కొన్ని మద్యం షాపుల తోపాటు ప్రధాన రహదారి పై ఉన్న రంజిత్ వైన్స్ కు పార్కింగ్ సదుపాయమే లేదు. దీంతో మద్యం కొనేందుకు వచ్చే వినియోగదారులు తమ బైక్ లు, స్కూటీలను ప్రధాన రహదారిపైనే ఇష్టారాజ్యంగా విచ్చలవిడిగా పార్కింగ్ చేస్తున్నారు. ఒకేసారి 30 నుండి 40 వాహనాలు రోడ్డు పై నిలపడంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా స్థానిక మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, కార్లు వెళ్లాలంటే ట్రాఫిక్ జామ్ లో చిక్కుకుంటున్నాయి. పాదచారులు నడవడానికి కూడా స్థలం లేకుండా పోయింది. సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ఇక్కడ నిత్యం నరకయాతనే. అక్కడే మద్యం తాగుతూ మందు బాబులు హల్చల్ చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మామూళ్ల మత్తులో అధికారులు వైన్స్ యజమాని పై చర్యలు తీసుకోవడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన రహదారిపై ఇలా పార్కింగ్ వల్ల ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రంజిత్ వైన్స్ కు పార్కింగ్ స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, రోడ్డుపై పార్కింగ్ ను నిషేధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





# జర్నలిస్టుల సమస్యల కోసం

- ప్రెస్ క్లబ్ కార్యాచరణ ప్రణాళిక

**హైదరాబాద్, మహా** : జర్నలిస్టులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు, వారి సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సోమాజిగూడ లో ఆదివారం నాడు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఎస్. విజయకుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రెస్ క్లబ్ సీనియర్ జర్నలిస్టులు, సభ్యులు హాజరయ్యారు. ప్రెస్ క్లబ్ స్థలం లీజు వెంటనే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రెస్ క్లబ్ ఏజీఎం ఏకగ్రీవంగా తీర్మానించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని దీనికోసం అన్ని జర్నలిస్టు సంఘాలను, యూనియన్లను కలుపుకొని కార్యాచరణ ప్రణాళిక అమలు చేసేందుకు కార్యవర్గం తీర్మానం ఆమోదించింది. అర్హులైన జర్నలిస్టులందరికీ హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని, వయోధిక పాత్రికేయులకు పెన్షన్లను ఇవ్వాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ప్రెస్ క్లబ్ ఏజీఎం తీర్మానించింది. ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ.రాజేష్, అరుణ అత్తలూరి, సంయుక్త కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్ , వర్ధిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు ముత్యాల సత్తిబాబు, ఎం. రమాదేవి, రచన ముడుంబై, వనం.నాగరాజు, ఎన్. శ్రీనివాస్ రెడ్డి, అమిత్ బట్టు, అశోక్ దయ్యాల, రాజేశ్వరి కల్యాణం, శంకర్ శిగ సర్వసభ సమావేశంలో పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్టులు దేవులపల్లి అమర్, ఆర్ .శైలేష్ రెడ్డి, దిలీప్ రెడ్డి, రవి కాంత్ రెడ్డి సహా యూసుఫ్ బాబు తదితరులు హాజరయ్యారు. మరణించిన ప్రెస్ క్లబ్ సభ్యుడి కుటుంబానికి 50వేల రూపాయల ఆర్థిక సహాయం తక్షణం అందజేయాలని ప్రెస్ క్లబ్ సర్వసభ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సీనియర్ పాత్రికేయులు, జర్నలిస్టు నాయకులు దేవులపల్లి అమర్ ను ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి శాలువతో సత్కరించింది.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 12-10-2026



# మృదుస్వభావి, కవి 'రఘువర్మ'

నివాళి

మనిషి సన్మార్గంలో నడిస్తే సమాజం దానికదే బాగుపడుతుంది అని నమ్మి ఏ ఇజాల వైపు వెళ్లకుండా తన భావాలను సరళ వచన కవితల రూపంలో ప్రకటించిన కవి రఘువర్మ. ఈ మధ్య వరుసగా అనువాద కవిత్వాన్ని అందిస్తున్న ఆయన డెబ్బయ్యవ ఏట జగిత్యాలలోని స్వగృహంలో అక్టోబర్ 6 న హఠాన్మరణం పొందారు. సంస్కృతాంధ్ర భాషలపై మంచి పట్టున్న రఘువర్మ ప్రసిద్ధ సంస్కృత కావ్యాలను తెలుగులోకి అనువదించిన తన సత్తాను చాటారు. కాళిదాసు మేఘసందేశమ్, ఋతుసంహారః, భర్తృహరి నీతిశతకం, ఠాగూర్ గీతాంజలి తదితర మహాకావ్యాలను ఆయన నేటి పాఠకులను దృష్టిలో పెట్టుకొని సరళ వచన కవితా రీతిలో అనువదించారు. గత ఏడాది ఆయన తన అనువాద సాహిత్యానికి గుర్తింపుగా తెలుగు విశ్వవిద్యాలయం నుండి రామవరపు శాంతసుందరి స్మారక పురస్కారం పొందారు.



రఘువర్మ

సంస్కృతంలో ఉత్కృష్టమైన కాళిదాసు శ్లోకాలను రఘువర్మ ఆధునిక తెలుగు వచన కవితా మార్గంలో అనువదించి చదువరులకు చేరువ చేశారు. మూల రచన భావాలను పుణికి పుచ్చుకొని, నేటి కాలానికి సరిపడేలా సంక్షిప్తీకరించి వాటి పట్ల పఠనాసక్తిని పెంచే ప్రయత్నం చేశారు. స్వేచ్ఛానువాద శైలిలో, అచ్చ తెనుగు పదబంధాలు సమాసాలను జోడించి అనువాదానికి కొత్త వన్నె తెచ్చారని పండితులు ఆయన కృషిని శ్లాఘించారు. రవీంద్రుడి గీతాంజలిని ఆంగ్ల గద్య కవిత పద్ధతిలో అనువదించినవారే ఎక్కువ. అయితే రఘువర్మ పూర్తిగా వచన కవితలాగా పాదనిర్మాణం, వాక్యనిర్మాణాలను దృష్టిలో ఉంచుకొని 'గీతాంజలి'ని వచనకావ్యంగా తీర్చిదిద్దారు.

రఘువర్మ అసలు పేరు తుమ్మనపల్లి లక్ష్మీనారాయణ. చదువుకొనే రోజుల్లో రఘువర్మ అనే కలం పేరుతో కవితారచన ఆరంభించారు. 1975 లో విశ్వరచన పత్రికతో ఆరంభమైన ఆయన కవితలు అన్ని పత్రికల్లో కనబడేవి. తన కవితలతో హృదయజలధి, కవిత్వం వింత భాష, మూడో కంటి చూపు, మేఘ రాగరంజని అనే సంపుటాలుగా తెచ్చారు. కవి, అనువాదకుడైన రఘువర్మ మంచి చిత్రకారుడు, గాయకుడు కూడా. సినీ, లలితా సంగీత గీతాలను ఆలపించి పలు ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారు. విశేష సందర్భాల్లో తన గురువులకు, మిత్రులకు వారి పోర్ట్రయిట్ చిత్రాలను వేసి బహూకరించేవారు. తన పుస్తకాలకు తానే ముఖచిత్ర రచన చేసుకున్నారు.

రఘువర్మ జీవితం ఎన్నో ఒడుదుడుకుల మధ్య సాగినా ఏనాడూ వాటి పట్ల చింతించలేదు. కళల ఆసరాగా అన్ని ఇబ్బందులను అలవోకగా దాటుకుంటూ జీవనపయనం సాగించారు. ఇంటర్ తోనే చదువును ఆపేయించిన తండ్రి ఆయనను సొంత వ్యాపారమైనా బంగారు దుకాణంలో ఉంచారు. చాటుమాటుగా దూరవిద్యలో డిగ్రీ పూర్తి చేసి, ఆ తర్వాత 1980 లో ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆర్ట్స్ కాలేజీలో చేరి అక్కడే తెలుగులో ఎం ఏ, పి హెచ్ డి పూర్తి చేశారు. కుందుర్తి కవితల్లో సామాజికత అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. రఘువర్మ ఆనాటి నుంచి రాసిన కవితల్లో కుందుర్తి ప్రభావం కనబడుతుంది. సమాజంలో మంచిని ప్రేమించాలనే, పెంచాలనే తాత్వికతను ఆయన కవితల్లో వచ్చి చేరింది.

ఎందుకోగానీ రఘువర్మ బోధనావృత్తి అంతా తాత్కాలిక విధానంలోనే గడిచింది. నికరమైన ఉద్యోగం లేకపోవడంతో జీవితంలో స్థిరపడలేకపోయారు. మొదటి నుండే భేషజాలు లేకపోవడం వల్ల ఉన్నంతలో బతకడం అలవాటు చేసుకొని తన కళారంగ బాటలోనే ఒంటరి జీవితాన్ని గడిపారు. దెబ్బపై దెబ్బలా 1996 లో ఆయన కుడి కన్ను చూపు కోల్పోయింది. జీవితంలో ఏది ఎదురైనా దాటుకుపోయే సుగుణం ఉన్నందువల్ల ఆయన ఒకే కన్నుతో ఎన్నో సాధించారు. లౌక్యానికి, కపటానికి చోటులేని ఆయన జీవితంలో ఒకరిని నొప్పించిన సందర్భమే లేదు. ఎంచుకున్న ఆంగ్ల కవితలను తెలుగులోకి వరుసగా అనువదిస్తున్న ఆయన కలం హఠాత్తుగా ఆగిపోయింది. స్నేహశీలిగా, కళాస్రష్టగా రఘువర్మ ముద్ర చెరిగిపోదు.

బద్రి నర్సన్ 9440128169

## 15న రెండు పుస్తకాల ఆవిష్కరణ సభ

వర్తన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో
పాలపిట్ట తెలంగాణ కవిత 2026 (కవితా సంకలనం)
పాలపిట్ట కథ 2026 (కథా సంకలనం)
ఆవిష్కరణ సభ
15 అక్టోబర్ 2026 సాయంత్రం ఆరు గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరుగుతుంది.
పుస్తకాలను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు
డా. ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరిస్తారు.
సభలో తాటికొండాల నరసింహారావు , సిహెచ్. ఉషారాణి, చింతపట్ల సుదర్శన్, డా. రూప్ కుమార్ డబ్బీకార్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ ప్రసంగిస్తారు.

గుడిపాటి

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
haneef777@gmail.com
whatsapp 9247580946

## సాహిత్యంలో నోబెల్ ప్రైజ్ 2026 బహుమతి గ్రహిత

# సరిహద్దుల్ని చెరిపేసిన సాహితీ స్వరం: 'ఆన్ కార్సన్'




ప్రపంచ సాహిత్యంలో తనదైన అసమాన శైలితో పాఠకులను, విమర్శకులను మంత్రముగ్ధులను చేసిన కెనడియన్ కవయిత్రి, ఆన్ కార్సన్ 2026 సంవత్సరానికి సాహిత్య నోబెల్ పురస్కారాన్ని దక్కించుకున్నారు. నోబెల్ బహుమతి సాధారణంగా ఏ ఒక్క నిర్దిష్ట గ్రంథానికో కాకుండా రచయిత జీవితకాల సమగ్ర సాహిత్య కృషిని గుర్తించి ప్రకటిస్తారు.

సాహిత్యంలో సంప్రదాయ ప్రక్రియలైన కవిత్వం, వ్యాసం, నాటకం, అనువాదాల మధ్య ఉన్న సరిహద్దు రేఖలను తుడిచేసి, సరికొత్త దృక్పథాన్ని ఆవిష్కరించిన అరుదైన ప్రతిభామూర్తి ఆమె. ప్రాచీన గ్రీకు తాత్వికతను సమకాలీన మానసిక సంఘర్షణలతో ముడివేసి, భాషలోని అస్పష్టతను కూడా గొప్ప కళగా మలచడం కార్సన్ రచనా శైలిలోని విశిష్టత. క్లాసికల్ లిటరేచర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూనే, ఆధునిక కవితా వినీలాకాశంలో ఆమె ఒక విశిష్ట ధ్రువతారగా నిలిచారు.

ఆన్ కార్సన్ 1950 జూన్ 21న కెనడాలోని టొరంటో నగరంలో రాబర్ట్ కార్సన్, మార్గరెట్ కార్సన్ దంపతులకు జన్మించారు. తండ్రి బ్యాంక్ మేనేజర్ కావడంతో ఆమె బాల్యం కెనడాలోని వివిధ చిన్న పట్టణాల్లో గడిచింది. 1950ల కాలంలో టొరంటో నగరం తనదైన సరికొత్త సాహిత్య గుర్తింపును బలంగా నిర్మించుకుంటున్న దశలో ఉంది. ముఖ్యంగా టొరంటో విశ్వవిద్యాలయం కేంద్రంగా ప్రపంచ ప్రఖ్యాత విమర్శకుడు నార్త్రోప్ ఫ్రై తాత్విక సిద్ధాంతాలు, రాబర్ట్‌సన్ డేవిస్ రాసిన విశిష్ట నవలలు, కవి జేమ్స్ రీనీ రచనలతో పాటు మార్గరెట్ లారెన్స్, అప్పుడే ఎదుగుతున్న మార్గరెట్ అట్‌వుడ్ వంటి వారి సృజనాత్మక గొంతులు కెనడియన్ సాహిత్య రంగాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. అటువంటి చైతన్యవంతమైన మేధో వాతావరణంలో మొదలైన కార్సన్ ఆలోచనా ప్రస్థానమే, అనంతర కాలంలో ఆమెను ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక ఆలోచనలతో మేళవించిన అరుదైన సాహిత్యవేత్తగా తీర్చిదిద్దింది.

ఆన్ కార్సన్ రచనలు ఎప్పుడూ ఒకే చట్రానికి పరిమితం కావు. ఆమె శైలిని విమర్శకులు 'కవితాత్మక వ్యాసం' లేదా 'పద్య నవల' అని అంటారు. ఆలోచనను లోతుగా విశ్లేషించే పద్ధతి వ్యాసమైతే, దానికి ప్రాణం పోసే లయబద్ధత కవిత్వమై ఆమె రచనల్లో సాగుతుంది. కార్సన్ తన తొలి పరిశోధనాత్మక గ్రంథం Eros the Bittersweet (1986)తోనే సాహిత్య లోకంలో బలమైన ముద్ర వేశారు. ప్రేమ కేవలం ఒక కలయిక మాత్రమే కాదని, అది కోరిక, లోటు మధ్య నిరంతరం ఊగిసలాడే ఒక తీపిచేదు అనుభవమని ప్రాచీన గ్రీకు ఆధారాలతో ఆమె నిరూపించారు.

ఒక రచయిత్రిగా, అనువాదకురాలిగా కార్సన్ కలం నుండి ఇప్పటివరకు ఇరవైకి పైగా విశిష్ట గ్రంథాలు వెలువడ్డాయి. Plainwater, Men in the Off Hours, The Beauty of the Husband, Nox, Float వంటి స్వంత రచనలతో పాటు, ప్రాచీన గ్రీకు కవులైన సాఫో, యూరిపిడిస్, సోఫోక్లెస్ నాటకాలను ఆధునిక ఆంగ్లంలోకి ఆమె అనువదించిన తీరు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందింది.

ఆన్ కార్సన్ సమగ్ర సాహిత్యంలో శిఖరాయమానమైన గ్రంథంగా నిలిచి, ఆమెకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టిన రచన 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ రెడ్' (1998). ప్రాచీన గ్రీకు పురాణాల్లోని 'గెరియన్' అనే ఎర్రటి రెక్కల రాక్షసుడి కథను తీసుకొని, అతడిని ఆధునిక కాలపు ఒక సున్నిత మనస్కుడైన కుర్రాడిగా, ఫోటోగ్రాఫర్‌గా ఆమె ఈ పద్య నవలలో పునఃసృష్టించారు. పురాణంలో రాక్షసుడిని చంపే హెరాకిల్స్ అనే వీరుడితోనే, ఇక్కడ గెరియన్ ప్రేమలో పడతాడు. అయితే హెరాకిల్స్ తనను సరిగ్గా అర్థం చేసుకోలేక దూరం పెట్టినప్పుడు, ఆ చేదు అనుభవం గెరియన్‌ను తీవ్రమైన మానసిక వేదనలోకి నెట్టివేస్తుంది. ఆ బాధ నుంచి బయటపడటానికి గెరియన్ ఫోటోగ్రఫీని ఒక సాధనంగా ఎంచుకుని, కెమెరా కంటితో చుట్టూ ఉన్న ప్రపంచాన్ని, తనలోని నిశ్శబ్దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. వీపుపై ఉన్న ఎర్రటి రెక్కలు అతని అంతర్గత కళాత్మకతకు, సమాజం నుంచి ఎదురయ్యే పరాయితనానికి ప్రతీకలుగా నిలుస్తాయి. పాత కథలోని ఒక విలన్ పాత్రను ఒక సాదాసీదా మనిషిగా మార్చి, అతనిలోని అమాయకత్వాన్ని, ప్రేమలోని నిస్సహాయతను చూపించడమే ఈ రచన సాధించిన అపురూప విజయం.

***

కవిత్వానికి సరిహద్దులు గీసి ఇది మాత్రమే పద్యం అని చెప్పే రోజులు ఎప్పుడో దాటిపోయాయి. ఆ సరిహద్దులను చెరిపేసి ప్రపంచ కవిత్వంలో సరికొత్త దారులు వేసిన కవయిత్రి యాన్ కార్సన్. ఆమె 1995లో వెలువరించిన "Plainwater" అనే పుస్తకంలో "The Life of Towns" పేరిట రాసిన కవితలు చాలా ప్రత్యేకమైనవి. మనుషుల అనుభవాలను, బాధలను, లోపలి ఊహా ప్రపంచాలను ఆమె ఒక్కొక్క ఊరుగా చూపిస్తారు. ఇవి మామూలు ఊళ్లు కావు; మనిషి మనసు విరిగిపోయినప్పుడు, భయపడినప్పుడు, ఒంటరితనంలో కూరుకుపోయినప్పుడు చేరుకునే మానసిక ప్రదేశాలు. స్థలం, కాలం, భావోద్వేగాల మధ్య ఉన్న విడదీయరాని సంబంధాన్ని అత్యంత పొదుపైన పదాలతో చెప్పడం ఈ కవితల గొప్పదనం. ఉదాహరణకు ఐదు కవితలను ఎంచుకొని పరిశీలించే ప్రయత్నం చేస్తాను.

మొదటగా దైవభావన మరియు అపరాధ భావనల సంఘర్షణను ఆవిష్కరించే "Town of Finding Out About the Love of God" అనే కవితను పరిశీలిద్దాం.

నేనొక తప్పు చేశాను
ఈ రోజుకు ముందే.
ఇప్పుడిక నా సూట్‌కేస్ సిద్ధమైంది.
ప్రయాణం కోసమని
రెండు ఉడకబెట్టిన గుడ్లు
భద్రపరిచి ఉన్నాయి——
ఒకప్పుడు నా కళ్ళు ఉండిన చోట.
ఇంతకంటే వేరేలా ఎలా ఉండగలదు?
ఒక ఎండిన పుల్లను
ఈడ్చుకెళ్లే ప్రవాహంలా,
నా వెక్కిళ్ళే నన్ను నీకు
వినిపించేలా చేశాయి.

దేవుడి ప్రేమను తెలుసుకోవడం అంటే సాధారణంగా అందరూ ఏదో శాంతి దొరుకుతుందని అనుకుంటారు. కానీ కార్సన్ ఈ కవితలో ఆ ప్రేమను తెలుసుకోవడం ఎంతటి కఠినమైన శిక్షగా మారుతుందో చూపిస్తారు. చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా ఊరు విడిచి పోవాల్సిన అనివార్యత ఇక్కడ కనిపిస్తుంది. కళ్ల స్థానంలో ఉడకబెట్టిన గుడ్లు ఉన్నాయనడం భయంకరమైన మానసిక స్తబ్ధతకు నిదర్శనం. చూపు కోల్పోయి, మాట్లాడే శక్తి లేక, కేవలం ఏడుపు వెక్కిళ్ల ద్వారా మాత్రమే తన ఉనికిని చాటుకునే ఒక అనామక స్థితి ఇది. విధి అనే పెద్ద ప్రవాహంలో కొట్టుకుపోయే చిన్న ఎండు పుల్లలా మనిషి నిస్సహాయంగా మిగిలిపోతాడు.

అంతరంగంలో దేవుడి ఎదుట తన తప్పిదాన్ని ఒప్పుకుంటూ చూపు కోల్పోయిన మనిషి స్థితి ఇలా ఉంటే, అదే మనిషి బయటి సమాజంలోకి వచ్చినప్పుడు ఇతరుల క్రూరమైన చూపుల ఎదుట పడే వేదన మరింత తీవ్రంగా ఉంటుంది.

ఆ సామాజిక భయాన్ని చిత్రించే ఈ క్రింది కవితే "Town of the Sound of a Twig Breaking".

వారి ముఖాలు కత్తులని
నేను అనుకున్నాను.
వాటిని నా వైపు గురిపెట్టి
వేచి చూసిన తీరు అలాంటిది.
వేటగాడంటే తన ఎర కోసం
ఎంత నిశితంగా పొంచి వినేవాడంటే——
ఆ వినే తీవ్రతే అతని చేతిలోని
ఆయుధాన్ని బయటకు లాగి
తనను తానే పొడుచుకునేలా చేస్తుంది.

మన చుట్టూ ఉండే సమాజం మనల్ని పరిశీలించే చూపులు ఒక్కోసారి కత్తుల్లా గుచ్చుకుంటాయి. సమాజం పెట్టే మానసిక ఒత్తిడిని ఈ కవితలో చాలా స్పష్టంగా చూపిస్తారు. అయితే ఇక్కడ బాధితుడి భయం కంటే వేటాడేవాడి స్వభావం మీద కార్సన్ గొప్ప ఆలోచనను చూపిస్తారు. ఒకరిని నాశనం చేయాలనే పగతో ఎదుటివారి మీద నిఘా పెట్టే వేటగాడు, ఆ ఆలోచనల్లోనే మునిగిపోయి చివరికి తన సొంత ఆయుధంతో తానే గాయపడతాడు. ఎదుటివారిపై మనం చూపించే ద్వేషం చివరికి మనల్నే ఎలా దెబ్బతీస్తుందో ఈ కవిత చాలా బలంగా చెబుతుంది.

బాహ్య సమాజం విసిరే నిశిత చూపులు, వేటాడే ఉద్వేగాలు కలిగించే భయం ఒకెత్తయితే, అత్యంత ఆత్మీయమైన వ్యక్తిగత బంధంలో అవతలి మనిషి కనీసం తన వైపు చూడనే చూడని నిశ్శబ్ద ఉపేక్ష మరింత తీవ్రమైన నరకాన్ని సృష్టిస్తుంది.

"Town of Uneven Love" శీర్షికతో ఉన్న కవిత ఏకపక్ష ప్రేమలోని నిస్సహాయతను తెలియజేస్తుంది. ఈ కవితకు ఉప శీర్షిక 'కానీ ప్రతి ప్రేమా అసమానమైనదే'.

నన్ను తను ప్రేమించి ఉంటే
మేడ గది కిటికీ అద్దానికి
నా నుదురును బాదుకుంటూ ఉండగా
అతడు నన్ను చూసి ఉండేవాడు.

ఈ కవిత మొదటి వాక్యమే ఒక నిర్వికారమైన నిజాన్ని ముందే ఒప్పిస్తుంది. లోకంలో ఏ ఇద్దరి మధ్యా ప్రేమ సమానంగా ఉండదు; ఒకరు ఎక్కువగా ప్రేమిస్తే మరొకరు తక్కువగా ప్రేమిస్తారు. లోపల గదిలో తీవ్రమైన మానసిక వేదనతో కిటికీ అద్దానికి నుదురు బాదుకుంటున్నా, కింద ఉన్న ఆ మనిషికి అది కనిపించకపోవడం అత్యంత బాధాకరమైన విషయం. ఇక్కడ కిటికీ అద్దం ఒక అదృశ్య గోడలా నిలిచింది. ఎదుటి వ్యక్తి దృష్టిలో పడలేకపోవడం, ప్రేమించిన మనిషి నిర్లక్ష్యానికి గురికావడం అనేది ఒకరి ఉనికినే మాయం చేయడంతో సమానం.

ప్రేమలో ఎదుటి వ్యక్తి తనను గుర్తించకపోవడం ఒక రకమైన శూన్యతను మిగిలిస్తే, అదే అనుబంధంలో నమ్మిన వ్యక్తి నుండి ఎదురయ్యే మోసం, ఆ ద్రోహం తెచ్చిపెట్టే అసహ్యకరమైన అపరాధ భావం మనిషిని తనపై తనకే ఏహ్యత కలిగేలా చేస్తాయి.

జీసస్ క్రీస్తును కొన్ని వెండి నాణేల కోసం పట్టించిన శిష్యుడు యూదాస్ మనస్తత్వాన్ని ఈ కవిత ఆధారం చేసుకుంటుంది. తప్పు చేసిన తర్వాత ఆ తప్పుకు సాక్ష్యాలుగా నిలిచిన పరిసరాలను మనిషి తట్టుకోలేడు. అందుకే కవితలోని ప్రతి మాట ముందు 'కాదు' అనే తిరస్కరణ కనిపిస్తుంది. ఒలీవ చెట్లు, చంద్రుడు, రాత్రి వేళ, రొట్టె ముక్క——ఇవన్నీ ద్రోహానికి సాక్ష్యాలు. వాటన్నింటినీ కాదనుకుంటూ వెళ్లి, చివరికి 'నేనూ కాదు' అంటూ తన ఉనికినే ప్రశ్నార్థకం చేసుకోవాలనిచూస్తాడు. అపరాధ భావం పరాకాష్టకు చేరినప్పుడు మనిషి తనను తాను గుర్తించుకోవడానికి కూడా ఎంతగా భయపడతాడో ఇందులో కనిపిస్తుంది.

ద్రోహం తెచ్చిపెట్టే ఇలాంటి భరించలేని అపరాధ భావం నుండి విముక్తి పొందడానికి, మనిషి అసలు మంచిచెడులనే నైతిక చట్రాన్ని లేదా 'పాపం' అనే భావననే పూర్తిగా వదిలేసి ప్రకృతిలోని గాలుల్లోకి పారిపోవాలని కోరుకుంటాడు.

ఆ నైతిక సంకెళ్ల విముక్తిని చూపే కవితే 'Town of the Death of Sin'.

పాపం అంటే ఏమిటి?
అని నువ్వు అడిగావు.
చంద్రుడు మా పక్కనుండి
కొరుకుతున్నట్లు కదిలిపోయాడు.
అకస్మాత్తుగా నేను నిన్ను చూశాను——
నువ్వు పాపాన్ని అక్కడే పారేసి,
అడవిపై వీచే నల్లటి
గాలిలా వెళ్ళిపోయావు.

మనుషులుగా మనం మోసే నైతిక బరువును, నిబంధనలను ఒక అనవసరమైన బరువులా నేలకేసి కొట్టి వెళ్లిపోవడమే ఈ కవితలోని ప్రధాన అంశం. పాపం అంటే ఏమిటన్న ప్రశ్నకు సమాధానం వెతక్కుండా, ఆ భావననే పూర్తిగా విడిచిపెట్టి అడవి మీదుగా వీచే నల్లటి గాలిలా స్వేచ్ఛగా వెళ్లిపోవడం ఒక రకమైన విడుదల. అయితే ఆ విడుదల ప్రశాంతమైనది కాదు; అందులో ఒకరకమైన చీకటి, మొరటుతనం ఉన్నాయి. చట్టాలు, నైతికతలు రాలిపోయిన చోట మనిషి నాగరికతను వదిలేసి ఆదిమమైన గాలిలా శూన్యంలో కలిసిపోతాడన్న సత్యాన్ని కార్సన్ ఆవిష్కరిస్తారు.

ఈ ఐదు కవితలను నిశితంగా గమనిస్తే యాన్ కార్సన్ కవితా శిల్పం ఎంత విలక్షణమైనదో అర్థమవుతుంది. ఆమె కవితల్లో అనవసరమైన వర్ణనలు, పెద్ద పెద్ద అలంకారాలు ఉండవు. కేవలం మూడు నాలుగు వాక్యాల్లోనే ఒక దృశ్యాన్ని కళ్లముందు నిలిపి, పాఠకుడి గుండెను తాకేలా చేస్తారు. కళ్ల స్థానంలో ఉడకబెట్టిన గుడ్లు, కత్తుల్లాంటి ముఖాలు, అద్దానికి నుదురు బాదుకోవడం, పారేసిన పాపం——ఇలాంటి అసాధారణమైన ప్రతీకలను వాడటం ఆమె శిల్ప రహస్యం.

ఈ శిల్పం ఇప్పటి ఆధునిక కవులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. భావాన్ని అతిగా వివరించి చెప్పడం కంటే, తక్కువ పదాలతో తీవ్రమైన భావోద్వేగాన్ని సృష్టించడం ఎలాగో ఈ కవితలు దృశ్యమానం చేస్తాయి. కవితను కేవలం ఒక ఉపన్యాసంలా మార్చకుండా, ఒక చిత్రకారుడిలా బలమైన దృశ్య ప్రతిమల ద్వారా పాఠకుడి ఊహకు చోటివ్వడం నేటి కవులకు అత్యంత ఆవశ్యకం. పాఠకుడిని నిశ్చేష్టుడిని చేసే సంక్షిప్తతను, ఆధునిక సంక్లిష్టతను పట్టుకోవాలనుకునే ఏ రచయితకైనా కార్సన్ కవిత్వం ఒక గొప్ప పాఠం. మానవ భాషలోని లోపాలను, వ్యక్తీకరణలో ఎదురయ్యే నిశ్శబ్దాన్ని బలహీనతగా కాక, ఆలోచనలను రేకెత్తించే ఒక బలమైన సాధనంగా మలచడమే కార్సన్ శైలిలోని అసలైన సౌందర్యం.

నేటి వేగవంతమైన ప్రపంచంలో ఆమె సాహిత్యం మరింత ఆవశ్యకమైంది. సోషల్ మీడియా యుగంలో మనుషుల మధ్య సంబంధాలు విస్తరించినా, అంతర్గత ఒంటరితనం, అభద్రత, విచ్ఛిన్నత నానాటికీ పెరిగిపోతున్నాయి. ఎదుటి వ్యక్తిని వారి భిన్నత్వంతో సహా అంగీకరించలేని అసహనం రాజ్యమేలుతున్న ప్రస్తుత సమాజంలో, విభిన్నంగా ఉండటాన్ని ఒక లోపంగా కాక ఒక ప్రత్యేక సౌందర్యంగా చూడాలని కార్సన్ రచనలు గుర్తుచేస్తాయి. ఒకరి బాధను, మౌనాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన సహానుభూతిని అందించే ఆమె రచనలు, పాత మూస ధోరణులను దాటి మనిషి అంతరంగాన్ని నిజాయితీగా దర్శించడానికి నేటి తరానికి దిక్సూచిలా నిలుస్తాయి.



-విల్సన్ రావు కొమ్మవరపు
ఫోన్: 89 854 35 515

# కాసింత ప్రేమ

మంగారి రాజేందర్ 'జింబో'
9440483001

ఆరోజు శుక్రవారం. ఫ్యామిలీ కోర్టు రద్దీగా ఉంది.ఒక కేసు తర్వాత మరో కేసును పిలుస్తున్నాడు బెంచ్ క్లర్క్. యువన్,తన్వి అని పిలిచాడు. ఇద్దరూ వచ్చి నిలుచున్నారు. తన్వి చేతిలో ఒక పాప ఉంది.పాప వయస్సు రెండు సంవత్సరాలు ఉండవచ్చు.

కేసు ఫైల్ చూశాడు న్యాయమూర్తి.వారిద్దరి మధ్య సయోధ్య కుదిరించడానికి ప్రయత్నం చేయాల్సిన దశలో ఉంది.వారి వైపు మరోసారి చూశాడు న్యాయమూర్తి. ఇద్దరి వయస్సు 30 సంవత్సరాల లోపు ఉంటుంది. అంత చిన్న వయసులో కోర్టు దాకా ఎందుకు వచ్చారోనని ఆలోచించాడు. వారిద్దరిని సాయంత్రం 4:30 కి కన్సిలేషన్ కోసం ఉండమని చెప్పాడు. అదే విషయాన్నీ క్లర్క్ వివరంగా వారికి తెలిపాడు.

సాయంత్రం చెప్పిన సమయానికి
వారిద్దరూ న్యాయమూర్తి చాంబర్ దగ్గర నిల్చునున్నారు. అప్పటికే కేసు ఫైలు ని చదివాడు న్యాయమూర్తి.వాళ్ళు వచ్చిన విషయాన్ని ఛాంబర్ లో ఉన్న న్యాయమూర్తికి బెంచ్ క్లర్కు చెప్పాడు.ముందు యువన్ ని పిలవమని చెప్పాడు జడ్జ్.అలాగే పిలిచాడు.ఆ అబ్బాయి లోనికి వచ్చి నమస్కారం చేసి నిలుచున్నాడు. అతన్ని కూర్చోమని చెప్పాడు న్యాయమూర్తి.యువన్ కూర్చోలేదు మరోసారి చెప్పాడు.అప్పుడు అతనికి ధైర్యం వచ్చి కూర్చున్నాడు. కోర్టుకు ఎందుకు వచ్చారో చెప్పమన్నాడు.వాస్తవాలను చెప్పండని అన్నాడు.

అతను చెప్పే విషయాలు ఫైలు లోకి వెళ్లవని కూడా చెప్పాడు.జరిగింది జరిగినట్టు చెప్పమన్నాడు.

యువన్ చెప్పడం ఆరంభించాడు.

'మూడు సంవత్సరాల క్రితం మా పెళ్లి
అయింది ఆమె ఐదు నెలల గర్భంతో ఉన్నప్పుడు మా ఇద్దరి మధ్యన గొడవ జరిగింది ఆరోజు నేను బయట పార్టీ ఉంటే తాగి వచ్చాను.ఆ నెలలో అది మూడవసారి తాగి రావడం.దాంతో ఆవిడ నాతో బాగా ఘర్షణ పడింది. నాకు బాగా కోపం వచ్చింది. ఆమెను కంట్రోల్ చేయడం నా వశం కాలేదు.కొట్టాలన్నంత కోపం వచ్చింది. చేయి లేపాను కానీ కొట్టలేదు.దాంతో ఆమెకు
చాలా కోపం వచ్చింది.రాత్రికి రాత్రే సూట్ కేస్ సదురుకొని వాళ్ళ అమ్మ వాళ్ళ ఇంటికి వెళ్లిపోయింది వద్దని నేను చాలా బతిమిలాడాను .తప్పు జరిగిందని ఒప్పుకున్నాను.అయినా ఆమె వినలేదు.ఊబర్ తెప్పించుకుంది వాళ్ళ ఇంటికి వెళ్లిపోయింది.వాళ్ళ నాన్నకి ఫోన్ చేసి ఆమె వాళ్ళింటికి వస్తున్న విషయం చెప్పాను.

ఆమెకు ఫోన్ చేస్తే ఎత్తలేదు.ఏం చేయాలి ? ఆమె క్షేమంగా చేరుకున్న విషయం తెలుసుకున్నాను.తెల్లవారి రెండు మూడు సార్లు ఫోన్ చేశాను కానీ ఆమె ఫోన్ ఎత్తలేదు. మా అమ్మ వాళ్ళకి విషయం చెప్పాను.వాళ్ళ ఇంటికి వెళ్లి తీసుకొని రమ్మని చెప్పారు. అలాగే వెళ్లాను.నేను రానని తెగేసి చెప్పింది.మొండికేసింది.చివరికి నేను తిరిగి వచ్చేసాను.

ఆ తర్వాత కొద్ది రోజులకి పోలీసులు వచ్చారు. నన్ను అరెస్ట్ చేశారు.కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నా మీదే కాదు.మా అమ్మ నాన్నల మీద కూడా కేసు పెట్టింది.అక్కడితో ఊరుకోలేదు.బెంగళూరులో ఉన్న మా అక్క పేరు కూడా ఫిర్యాదులో పేర్కొంది.మేం కట్నం కోసం వేధించామని ఫిర్యాదులో చాలా ఆరోపణలు చేసింది.వాళ్ళు యాంటిసిపేటరీ బెయిల్ తీసుకున్నారు. కోర్టు చుట్టూ తిరుగుతూ నానా యాతనలు పడుతున్నాం.దాంతో నా మనసు విరిగిపోయింది.ఇది వాస్తవంగా జరిగినది సర్.'

ఫైల్ లోకి చూశాడు న్యాయమూర్తి
కారణం లేకుండా తన నుండి వెళ్లిపోయిందని,తన పట్ల నిర్దాక్షిణ్యం గా వ్యవహరించిందని దరఖాస్తులో పేర్కొన్నాడు.అదే విధంగా మానసికంగా తనను చాలా వేధించిందని కూడా అతను పేర్కొన్నాడు.

అందుకని విడాకులు కావాలని కోరాడు.

'నీకు కూతురు ఉంది కదా!చూసావా ఎప్పుడైనా?' ప్రశ్నించాడు న్యాయమూర్తి

'కోర్టుకు వస్తున్నప్పుడే చూశాను. అమ్మాయి పుట్టిన సంగతి చెప్పారు.కానీ నేను వెళ్లలేదు అప్పటికే నా మనసు విరిగిపోయింది'చెప్పాడు

'ఇప్పుడేమంటావ్ మరి ' అడిగాడు జడ్జి

'నాకు విడాకులే కావాలి సర్...నేనిక కలిసి ఉండలేను'స్థిరంగా చెప్పాడు యువన్.

అతని వైపు దీర్ఘంగా చూసి తల పంకించి
అతన్ని బయట ఉండమని చెప్పి
తన్వి ని పిలవమని చెప్పాడు బెంచ్ క్లర్క్ కి.

ఆమెను పిలిచాడు క్లర్క్. పాపను బయటే ఉంచి లోపలికి వచ్చింది .ఆమెను కూడా కూర్చోమని చెప్పాడు న్యాయమూర్తి.ఆమె కూర్చోలేదు కూర్చొమ్మని మళ్లీ చెప్పాడు న్యాయమూర్తి.అప్పుడు కూర్చుంది తన్వి

'నీకు విడాకులు ఇష్టం లేదా? ' ఆమె ఫైల్ తిరగేస్తూ అడిగాడు

'లేదు సార్!'జవాబు చెప్పింది

'మరి కేసు గురించి నువ్వేం చెప్తావో చెప్పు. నిజం చెప్పు. ఉన్నది ఉన్నట్టుగా చెప్పమ్మా, ఆ విషయాలు రికార్డుల్లోకి ఎక్కవు 'అన్నాడు న్యాయమూర్తి

'పెళ్లయిన సంవత్సరం వరకు బాగానే ఉన్నాడు.ఆ తర్వాత అప్పుడప్పుడు పార్టీలకని వెళ్లేవాడు.తాగ వద్దని చాలాసార్లు చెప్పాను.సరే అనేవాడు.మళ్లీ పార్టీ లకి వెళ్లేవాడు.తాగి వచ్చేవాడు. ఇంట్లో తాగేవాడు కాదు.ప్రేమగానే వుండేవాడు. కానీ ఒకరోజు బాగా గొడవ జరిగింది. కొట్టడానికి చేయి ఎత్తాడు.దాంతో నాకు కోపం వచ్చింది. పెళ్లంటేనే చెడ్డ విసుగొచ్చింది.మా ఇంటికి వెళ్ళిపోయాను.ఆ తర్వాత మా అమ్మా వాళ్ళింటికి వచ్చి రమ్మని అడిగాడు.అప్పుడు నేను ఇష్టపడలేదు ఆ తర్వాత రెండు మూడు సార్లు మా నాన్న ని రిక్వెస్ట్ చేశాడు.నేను వెళ్ళనని చెప్పాను.

పాప పుట్టిన తరువాత తెలియచేసాం.అతను రాలేదు .ఎవరూ రాలేదు.అలా సంవత్సరం గడిచింది.ఏం చేయాలో తోచక మధ్యవర్తులను పంపించాం.ఫలితం లేకుండా పోయింది.చివరికి న్యాయవాది ని సంప్రదించాను. దాంపత్య జీవన హక్కుల కోసం పిటిషన్ పెట్టాలని కోరాను.అది ఆలస్యం అవుతుందని చెప్పి ఆయన క్రిమినల్ కేసు పెడదామని సలహా ఇచ్చారు. దీనితో అతను రాజీకి వస్తాడని చెప్పాడు.చివరికి క్రిమినల్ కేస్ తయారు చేశారు అది దాఖలు చేశాం.

అక్కడి వరకు చెప్పి ఆమె ఆగిపోయింది.

'ఫిర్యాదులో ఏం రాశారో నీకు తెలుసామ్మా..?'అడిగాడు న్యాయమూర్తి

'తెలుసు సర్ ' అన్నదామె

'నువ్వు చెప్పినట్టుగానే రాశారా ఇంకేమైనా రాశారా ?'

'ఆరోజు జరిగిన సంఘటన గురించి మాత్రమే చెప్పాను. అది సరిపోదని న్యాయవాది చెప్పాడు.ఆయన సలహా మేరకు వరకట్నం వేధింపుల గురించి అందులో రాసాం. .అంతేకాదు వాళ్ళ అమ్మ నాన్నని వాళ్ళ అక్కని అందులో




చేర్చాం.వాళ్లు కూడా వరకట్నం కోసం వేధించారని రాసాం..దాంతో వారంతా బాగా బిగుసుకుపోయారు.

ఆ తర్వాత పరిస్థితులు మరింత దిగజారినయి.'అందుకోసం ఆయన విడాకుల కోసం కేసు వేసాడు అని చెప్పింది తన్వి.

నాకు విడాకులు అవసరం లేదు సార్ !ఆయనతో పాటే కలిసి ఉండాలని ఉంది 'చెప్పింది తన్వి

ఇరువురి అభిప్రాయాలూ విని జడ్జి మళ్ళీ ఒకసారి ఫైల్ చదివారు.

ఆ తర్వాత యువన్ ని పిలవమని చెప్పాడు
యువన్ వచ్చి నిల్చున్నాడు.

'ఆమె విడాకులు సిద్ధంగా లేదు నీతో కలిసి ఉండాలని అంటుంది ఏమంటావ్ .?'అడిగాడు యువన్ ని.

'లేదు సర్ ! మా మీద అన్యాయంగా కేసు పెట్టింది.మా అమ్మ నాన్న చాలా ఇబ్బందులు పడ్డారు.యాంటిసిపేటరీ బెయిల్ తీసుకోవాల్సి వచ్చింది.మా అక్క పరిస్థితి కూడా అంతే .ఆ పది రోజులు వాళ్లు చాలా బాధలు పడ్డారు. నరకయాతనని అనుభవించారు.అందుకే నేను ఆమెతో కలిసి జీవించడానికి ఇష్టపడటం లేదు'అన్నాడు యువన్.

ఆమె వైపుచూశాడు న్యాయమూర్తి

'తప్పుడు ఆరోపణలు చేసింది నిజమే సార్! వాళ్ళేమీ వరకట్నం కోసం వేధించలేదు.ఇవన్నీ రాస్తే తప్ప కేసు బలంగా ఉండదని మా న్యాయవాది చెప్పాడు అందుకని అవన్నీ రాయాల్సి వచ్చిందని 'చెప్పింది ఆమె

'ఎన్ని అబద్ధాలు రాసింది సార్ !వాటిని ఒప్పుకుంది కూడా !అందుకని మా కేసు నడిపించండి 'అన్నాడు అతను న్యాయమూర్తితో

న్యాయమూర్తి అతని వైపు చూసి ఇలా అన్నాడు

'నిజమే !ఆమె తాను చేసిన తప్పులను ఒప్పుకుంది.నువ్వు చేసిన తప్పును కూడా ఒప్పుకున్నావ్.ఇప్పుడు నీ విడాకుల దరఖాస్తులో చాలా ఆరోపణలు చేశావు.అవన్ని అవాస్తవాలని నీకు తెలుసు.అయినా నీ కేసు బలంగా ఉండాలని మీ న్యాయవాది చెప్పినందుకు లేదా నీకు నువ్వే అవన్ని రాసి ఉంటావు.మీరు ఇద్దరు చిన్నపిల్లలు.30 సంవత్సరాలు కూడా దాటలేదు.ఇప్పుడు విడాకులు తీసుకుని ఏం సాధిస్తారు.మీ విడాకుల కేసు పరిష్కారం కావడానికి ఓ రెండు మూడు సంవత్సరాలు పడుతుంది. అక్కడితో అయిపోదు. పైన హైకోర్టు ఉంటుంది ఇంకా సుప్రీమ్ కోర్టు.అప్పటి వరకు మీ యుక్త వయస్సు పూర్తిగా పోతుంది.మీ పాప తండ్రి ప్రేమ లేకుండా పెరుగుతుంది.ఇవన్నీ అవసరమా ? ఇద్దరూ ఆలోచించండి.'అన్నాడు న్యాయమూర్తి.

ఆ మాటలతో ఇద్దరూ ఆలోచనల్లో పడ్డారు. అతను కాస్త మెత్త పడినట్టు కనిపించాడు.

క్లర్క్ వైపు చూసి 'బయట వాళ్ళ నాన్న ఉంటే పిలవండి 'అన్నాడు న్యాయమూర్తి.

కాసేపటికి వాళ్ళ నాన్న వచ్చాడు.

న్యాయమూర్తి యువన్ వైపు తిరిగి 'చూడు యువన్ ఈరోజు రాత్రి మీరిద్దరూ ఇక్కడ దగ్గర్లో ఉన్న మంచి హోటల్లో బస చేయండి.రేపు మధ్యాహ్నం వచ్చి మీ నిర్ణయం నాకు తెలియజేయండి. నా ప్రకారం మీ నిర్ణయం మారుతుంది.అది పాప కోసం కావచ్చు .మీకోసం కావచ్చు .మీ కుటుంబ సభ్యుల కోసం కావచ్చు. ఎవరికోసమైనా మీ నిర్ణయం మారే అవకాశం ఉంది. ఆలోచించు యువన్ 'అన్నాడు న్యాయమూర్తి.

యువన్ ఏమి మాట్లాడలేదు.మౌనంగా ఉన్నాడు.

'వీరిద్దరి దగ్గర ఈరోజు రాత్రి కలిసి ఉంటున్నట్టుగా ఒక డిక్లరేషన్ తీసుకో. సంతకాలు పెట్టించు.వాళ్ళ నాన్న సంతకం కూడా పెట్టించు. అది తెచ్చి నాకు ఇవ్వు 'అన్నాడు న్యాయమూర్తి క్లర్క్ తో.

ఇద్దర్ని తీసుకొని తన్వి నాన్న బయటికి వెళ్ళాడు
వాళ్ళిద్దరితో డిక్లరేషన్ తీసుకొని వారి సంతకాలు తీసుకున్న కాగితాన్ని న్యాయమూర్తి ముందు ఉంచాడు క్లర్క్.

'వాళ్ళు ఎలా కనిపించారు 'అడిగాడు బెంచ్ క్లర్క్ తో.

'ఆ కుర్రవాడు కాస్త మెత్తబడ్డట్టు ఉన్నాడు సార్ , పాపని ఎత్తుకున్నాడు.ముగ్గురు కలిసి అతని కారులోనే బయలుదేరారు 'అని చెప్పాడు క్లర్క్.

@@@@

శనివారం రోజు మధ్యాహ్నం వాళ్ళిద్దరూ కోర్టు కి వచ్చారు. వాళ్ళు వచ్చినట్టు న్యాయమూర్తికి చెప్పాడు క్లర్క్.ఇద్దరిని పిలిచారు. వాళ్ళు లోపలికి వచ్చారు.వాళ్ల మొఖాలు ఆనందంగా కనిపించాయి. భద్రకాళి గుడికి వెళ్ళివచ్చినట్టుగా వాళ్ళ మొఖాల మీద బొట్లు ఉన్నాయి 'చెప్పండి ఏం నిర్ణయం తీసుకున్నారు. ?'అడిగాడు న్యాయమూర్తి.

'కేసులు విత్ డ్రా చేసుకుంటాం సర్ 'అన్నారు ఇద్దరు ఒకేసారి చేతులు జోడించి

అతను విడాకుల కోసం వేసిన దరఖాస్తును విత్ డ్రా చేసుకుంటున్నట్టుగా మరో దరఖాస్తుని న్యాయమూర్తికి అందచేశారు.దాన్ని న్యాయమూర్తి ఆమోదించాడు.

న్యాయమూర్తి కి నమస్కరించి వారిద్దరూ కలిసి మేజిస్ట్రేట్ కోర్టు వైపు బయల్దేరారు క్రిమినల్ కేసు విత్ డ్రా చేసుకోవడానికి.

ఎక్కడో వారిద్దరికి కాసింత ప్రేమ ఉండి ఉంటుంది. వారి పాప దాన్ని పెంచి ఉండవచ్చు.అందుకు కుటుంబ న్యాయస్థానం తోడ్పడి ఉండవచ్చు.

ఏమైనా వారి కథ సుఖాంతం అయింది.




## వ్యాయామం, రన్నింగ్ ప్రతి ఒక్కరికి అవసరమే

- మందమర్రి ఎస్ఐ గోపతి నరేష్

**మందమర్రి, మహా** : ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో వ్యాయామం, రన్నింగ్, వాకింగ్ లు అవసరమేనని మందమర్రి పట్టణ ఎస్ఐ గోపతి నరేష్ అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ క్వారీలో జీటీఆర్ ఫౌండేషన్, అటవీశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఫారెస్ట్ ట్రైల్ రన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ గోపతి నరేష్‌తో పాటు మందమర్రి రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు ఉత్సాహంగా పరుగులు తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా యువత మారథాన్‌లలో పాల్గొనడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

**ప్రకృతిలో రన్నింగ్ ఆహ్లాదకరం : గుడికందుల రమేష్**

మందమర్రి రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు గుడికందుల రమేష్ మాట్లాడుతూ, ప్రకృతి ఒడిలో రన్నింగ్ చేయడం ఎంతో ఆహ్లాదకరమైన అనుభూతిని ఇస్తుందని అన్నారు. ఫారెస్ట్ ట్రైల్ రన్‌లో మందమర్రి రన్నర్స్ నుంచి 10 మంది సభ్యులు పాల్గొన్నట్లు తెలిపారు. భవిష్యత్తులో నిర్వహించే మారథాన్‌లలోనూ మందమర్రి రన్నర్స్ తరపున సభ్యులకు మార్గదర్శకత్వం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మందమర్రి రన్నర్స్ సభ్యులు ముడారపు అనిల్, రామంచ తిరుపతి, మ్యాజిక్ సాయి, శ్రీరాముల వెంకటేష్, డాక్టర్ రవి, గోపికృష్ణ, జక్కుల ప్రసాద్‌తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.




## మట్టె రవీందర్ కు మహాత్మాగాంధీ నేషనల్ పీస్ అవార్డు 2026

**మందమర్రి/మంచిర్యాల, మహా ప్రతినిధి** : మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు, కవి మట్టె రవీందర్ కు ప్రతిష్టాత్మక మహాత్మాగాంధీ నేషనల్ పీస్ అవార్డు 2026 లభించింది. మార్కాపురం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రధానం చేశారు. తెలంగాణ హైకోర్టు సూపరింటెండెంట్ పి.వి.పి. అంజనీ కుమారి చేతుల మీదుగా రవీందర్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. మంచిర్యాల జిల్లాలో సీనియర్ జర్నలిస్టుగా కొనసాగుతున్న రవీందర్ కొన్నేళ్లుగా సాహితీ రంగంలోనూ విశేష సేవలు అందిస్తున్నారు. ఆయన సాహితీ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుండి వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న 48 మందికి ఈ ఏడాది ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా 'మహాత్మా నీకో వందనం' అనే శీర్షికతో తాను రాసిన కవితను రవీందర్ చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు గొట్టెముక్కుల చెన్నకేశవులు, దిశా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, సంఘ సేవకులు నారాయణ స్వామి, నారాయణ రెడ్డి, ఎం.నాగిరెడ్డి, వరల్డ్ రికార్డు గ్రహీత బి.చంద్రశేఖర్, ఎస్.కె. కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. ఇటీవలే భద్రాచలంలో అక్షర కిరీటి అవార్డు పొందిన రవీందర్ ఇప్పుడు జాతీయ స్థాయి అవార్డు అందుకోవడం పట్ల ఆంధ్రప్రభ మంచిర్యాల, కొమరం భీమ్ జిల్లాల బ్రాంచ్ మేనేజర్ రహమత్ ఖాన్, మందమర్రి పట్టణ ప్రజలు, పాత్రికేయ మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.



## డైట్ మైదానంలో దసరా వేడుకల ఆరంభం

- ఉత్సవాలకు కంది మౌనాశ్రీనివాస రెడ్డి భూమి పూజ
- సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం

**ఆదిలాబాద్ మహా** : ప్రజలందరిపై దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని అందరూ సుఖ శాంతులతో వర్ధిల్లాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి ఆకాంక్షించారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డైట్ కాలేజీ మైదానంలో బతుకమ్మ ,దసరా వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై వేడుకలకు సమితి సభ్యులతో కలిసి భూమి పూజ చేసారు. అ సందర్భంగా ప్రజలకు దసరా ,మహిళలకు బతుకమ్మ పండగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి నాడు రావణ దహనం చేపడతామని అన్నారు. క్రమం తప్పకుండా గత పద్నాలుగేళ్లుగా ఇక్కడ రావణదహన కార్యక్రమం చేపడుతూ అదే ఆనవాయితీని ఈ సంవత్సరం కూడా కొనసాగిస్తోన్న సమితి సేవలను ఆమె అభినందించారు. సనాతన హిందూ ఉత్సవ సమితి హిందూ సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుతూ పట్టణంలో సమాజ హితం కోసం అనేక హిందూ పండగల ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఇలాగే ముమ్ముందు మరిన్ని ఉత్సవాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ దసరా బతుకమ్మ పండగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కంది మౌనా శ్రీనివాస రెడ్డి అభిలషించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు బండారి సతీష్ ,దర్శనా అశోక్ , దేరా కృష్ణా రెడ్డి ,నర్సింలు, వేద పండితులు సంతోష్ శర్మ,సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ ఖత్రి, , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ క్రాంతి , డాక్టర్ రజిత, సమితి గౌరవ అధ్యక్షులు కందుల రవీందర్, ప్రధాన కార్యదర్శి రేణికుంట రవీందర్, కోశాధికారి సంతోష్ అగర్వాల్,కార్యనిర్వహక అధ్యక్షులు దశరథ్ , ఉపదక్షులు సమనపల్లి నర్సింలు , సురేష్ పొడవాల్ , మహిపాల్ , సుభాష్ ఉరడే ,తిరుపతి రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీలు అన్నిరంగాలలో రాణించాలి

- గిరిజన యువత అభివృద్ధికి చదువే బలమైన ఆయుధం
- బాలికల విద్యకు తల్లిదండ్రులు ప్రాధాన్యమివ్వాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి
- సిరికొండ మండలంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పర్యటన



**ఆదిలాబాద్ మహా**: ఆదివాసీ గ్రామాల సమగ్ర అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని, గిరిజన యువత జీవితాల్లో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి చదువే బలమైన ఆయుధమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బాలబాలికలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆదివారం సిరికొండ మండలం కోసుపటేల్ గూడ గ్రామంలో ఇంద్రవెల్లి అమరవీరుడు పెందూర్ మచ్చు కుటుంబ సభ్యులైన దుర్గాబాయి-ఆనంద్ రావు దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం గ్రామంలో కల్వర్టు, ఇతర మరమ్మత్తుల పనులకు భూమిపూజ చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కోసుపటేల్ గూడలో గతంలో ఎల్ 3గా ఉన్న లబ్ధిదారుల జాబితాను ఎల్ 1కు మార్పు చేయించి ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, వీవోలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన నూతన భవనాల నిర్మాణాలతో పాటు పెండింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలకు నాణ్యమైన విద్య అందించాలని కలెక్టర్ సూచించారు. తల్లిదండ్రులు బాలికలకు సంపూర్ణ మద్దతునిస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించగలరని పేర్కొన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, గురుకులాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. బాలికలను చిన్న వయసులోనే చదువుకు దూరం చేయడం, బాల్యవివాహాలు చేయడం సరి కాదని, వారి భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు. దసరా సెలవుల అనంతరం విద్యార్థులు తప్పనిసరిగా పాఠశాలలు, గురుకులాలకు హాజరు కావాలని, సెలవు రోజుల్లో సమయాన్ని వృథా చేయకుండా హోంవర్క్, ప్రాజెక్టులను పూర్తి చేసుకుంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించినప్పుడే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని అన్నారు. భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో బోర్ల తవ్వకాలపై ఆధారపడకుండా మిషన్ భగీరథ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా బోర్ల వద్ద రీచార్జ్ నిర్మాణాలు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు, పెర్కొలేషన్ ట్యాంకులు ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించుకోవాలని వివరించారు. నీటి వనరులను కాపాడుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శివరామ్, తహశీల్దార్ అరవింద్ కుమార్, ఎంపీడీవో రఘువీర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ డీఈ రమేష్, సర్పంచ్ గణపతి, నాయకులు ఆడే గజేందర్, స్థానిక సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతం

**సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. గంగాధర్**

**పెద్దపల్లి మహా:** వినియోగదారులకు మెరుగైన వోల్టేజ్‌తో పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పెద్దపల్లి విద్యుత్ సర్కిల్ పరిధిలో విస్తృతంగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. గంగాధర్ తెలిపారు. గత రెండున్నరేళ్లలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు 11 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, అదనంగా 7 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే 127 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచి, మరో 147 అదనపు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ అవసరాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఐదు కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు గంగాధర్ తెలిపారు. వీటి ఏర్పాటుతో ఇప్పటికే ఉన్న సబ్‌స్టేషన్లపై విద్యుత్ లోడ్ తగ్గడంతో పాటు, ఓవర్‌లోడింగ్ సమస్యలను నియంత్రించేందుకు, వోల్టేజ్ స్థాయిలను మెరుగుపరిచేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి, ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. వేసవి విద్యుత్ అవసరాలకు ముందస్తు చర్యలు రబీ సీజన్‌తో పాటు రాబోయే వేసవిలో పెరిగే విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని టీజీఎన్‌పీడీసీఎల్ పంపిణీ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేస్తున్నట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ తెలిపారు



## అమ్మవారి మాల ధరించిన మున్సిపల్ చైర్‌పర్సన్

**ఆదిలాబాద్ మహా**: అదిలాబాద్ పట్టణంలోని గణేష్ మందిర్ లో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ మాల ధరించి దీక్ష స్వీకరించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ప్రార్థించారు. అమ్మవారి మాల ధరించడం ఎంతో పవిత్రమైన ఆధ్యాత్మిక అనుభూతినిస్తుందన్నారు. భక్తి, విశ్వాసం, నియమ నిష్ఠలతో అమ్మవారి దీక్షను చేపట్టడం మనసుకు ప్రశాంతతను, ఆధ్యాత్మిక బలాన్ని ఇస్తుందన్నారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ, ప్రజల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని అమ్మవారిని వేడుకుంటున్నట్టు తెలిపారు.

## క్రిప్టో కరెన్సీ పేరుతో 10 కోట్లకు పైగా టోకరా

- ముఠా గుట్టు రట్టు చేసిన జిల్లా పోలీసులు
- ఆరుగురిపై కేసు -ఇద్దరి అరెస్ట్
- రెండేళ్లలో పెట్టుబడులు రెట్టింపని మోసం
- రెండు తెలుగు రాష్ట్రాల్లో 500 మంది బాధితులు
- పలు ఆస్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచన



**ఆదిలాబాద్ మహా**: క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని, రెండేళ్లలో పెట్టుబడులు రెట్టింపు అవుతాయని నమ్మించి ప్రజలను మోసం చేసిన ఐటీసీ గ్లోబల్ సంస్థకు చెందిన ఇద్దరు నిందితులను ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఈ ముఠా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ వందలాది మందిని మోసం చేసి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు జువ్వక నర్సింలును ఐటీసీ గ్లోబల్ సంస్థ ప్రతినిధులు సంప్రదించి, పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని, పెట్టుబడి రెట్టింపు అవుతుందని, మంచి రాబడులు కూడా పొందవచ్చని నమ్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి మాటలు నమ్మిన నర్సింలు 2023లో ఐటీసీ 58708 ఐడీ ద్వారా రూ.7 లక్షల 50వేలు పెట్టుబడిగా పెట్టారు. అయితే పలుమార్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా నిందితులు చెల్లించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఐటీసీ క్రిప్టో కరెన్సీ పేరుతో లక్ష నుంచి రూ.3 లక్షల వరకు వివిధ ప్యాకేజీలను ప్రవేశపెట్టి, పెట్టుబడి పెట్టిన మొత్తం రెండేళ్లలో రెట్టింపు అవుతుందని ప్రజలను నమ్మించారు. నాన్ వర్కింగ్ ప్లాన్‌లో రెండేళ్లకు పెట్టుబడి రెట్టింపు అవుతుందని, వర్కింగ్ ప్లాన్‌లో కొత్త సభ్యులను చేర్పితే వారి పెట్టుబడులపై 25 శాతం వరకు కమీషన్ లభిస్తుందని ఆశ చూపినట్లు గుర్తించారు. ఎక్కువ లాభాలు వస్తాయనే ఆశతో మరింత మందిని సభ్యులుగా చేర్చుకునేలా ప్రోత్సహించి, వారి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు వివిధ ప్రాంతాల్లోని హోటళ్లు, లాడ్జీలలో సమావేశాలు నిర్వహించడంతో పాటు జూమ్ మీటింగ్‌లు, వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా పథకం గురించి వివరించారు. డైరీలు, క్యాలెండర్లు పంపిణీ చేస్తూ తమ సంస్థపై నమ్మకం కలిగించే ప్రయత్నం చేశారు. పెట్టుబడులు పెట్టాలనుకునే వారితో వెబ్‌సైట్ లో రిజిస్ట్రేషన్ చేయించి, ఆన్‌లైన్ ఎక్స్ఛేంజ్‌లు లేదా గూగుల్ పే వంటి డిజిటల్ చెల్లింపు మార్గాల ద్వారా డబ్బులు పంపించాలని సూచించారు. డబ్బులు చెల్లించిన వారికి వారి ఐడీలలో ఐటీసీ క్రిప్టో కరెన్సీ జమ చేసినట్లు చూపించేవారు. 2023లో నిందితులు తమ ఏజెంట్ల ద్వారా ఆదిలాబాద్‌కు వచ్చి ద్వారక హోటల్‌లో సమావేశాలు నిర్వహించి, ఐటీసీ క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ప్రజలను నమ్మించినట్లు విచారణలో వెల్లడైంది. ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం ఐదుగురు బాధితులు సుమారు 30 లక్షల రూపాయలు నష్టపోయినట్లు గుర్తించారు. ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసిన అనంతరం వెబ్‌సైట్‌ను మూసివేసి, పెట్టుబడులు తిరిగి చెల్లించకుండా నిందితులు కాలయాపన చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. బాధితులు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినప్పటికీ, మరికొన్ని రోజుల్లో చెల్లిస్తామని చెబుతూ తప్పించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇద్దరు ప్రధాన నిందితులు ఐటీసీ గ్లోబల్ వ్యవస్థాపకుడు విశాఖపట్నం కు చెందిన పొలమారశెట్టి రత్నరాజు రావు, సహ వ్యవస్థాపకుడు పశ్చిమ గోదావరికి చెందిన దొండపాటి లక్ష్మణరావు లను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. సంస్థ ప్రతినిధులు గోపికృష్ణ ,అజీమ్ ఖాన్ ,ఏజెంట్లు వరంగల్ కు చెందిన గాజుల ప్రమోద్ కుమార్ , వేమునూరి సుధీర్ లపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దర్యాప్తులో భాగంగా నిందితులకు సంబంధించిన జహీరాబాద్ , రాజమండ్రి కి సంబంధించిన ఆస్తులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు, ఆర్థిక లావాదేవీలను పరిశీలిస్తూ మిగిలిన నిందితుల పాత్ర, ఇతర బాధితుల వివరాలు, మోసానికి గురైన మొత్తం నగదు వివరాలను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు. క్రిప్టో కరెన్సీ పేరుతో తక్కువ సమయంలో పెట్టుబడులు రెట్టింపు చేస్తామని, అధిక లాభాలు ఇస్తామని చెప్పే వ్యక్తులు, సంస్థల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఆన్‌లైన్ ప్రచారాలు, జూమ్ మీటింగ్‌లు, ఏజెంట్ల మాటలు నమ్మి కష్టార్జిత డబ్బులను పెట్టుబడిగా పెట్టవద్దని తెలిపారు. ఏదైనా పెట్టుబడి పథకంలో చేరే ముందు ఆ సంస్థ విశ్వసనీయత, చట్టబద్ధతను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. ఇలాంటి మోసాలకు గురైనవారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సైబర్ ఆర్థిక మోసాలకు గురైతే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్, ఎస్ఐలు అశోక్, సంజయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అగ్రసేన్ మహారాజ్ చౌక్ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ భూమిపూజ

**అదిలాబాద్ మహా** :ఆదిలాబాద్ పట్టణంలోని డోక్వాల్ కాంప్లెక్స్ పక్కన అగ్రసేన్ మహారాజ్ చౌక్ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అగర్వాల్, మార్వాడీ సమాజాలకు ఆరాధ్యుడైన అగ్రసేన్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ఆయన పేరిట చౌక్ ఏర్పాటు చేయడం ఎంతో గర్వకారణమని, సంతోషంగా ఉందని తెలిపారు. అగ్రసేన్ మహారాజ్ గొప్ప ఆదర్శాలు, సమాజానికి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గతంలో క్షత్రియుడిగా ఉన్న అగ్రసేన్ మహారాజ్ మహాభారత యుద్ధ సమయంలో జరిగిన హింసను చూసి, హింసకు దూరంగా ఉంటూ అహింసా మార్గాన్ని ఎంచుకుని వైశ్య సమాజ అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడిగా ప్రసిద్ధి చెందారని తెలిపారు. అలాంటి మహనీయుని పేరిట అగ్రసేన్ మహారాజ్ చౌక్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రసేన్ మహారాజ్ కమిటీ సభ్యులు, అగర్వాల్ సమాజ్ కమిటీ సభ్యులు, రాజస్థానీ సమాజ ప్రతినిధులు, బజరంగ్‌లాల్ అగర్వాల్, మోహన్ అగర్వాల్, ఓమ్ సేట్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.






## రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం

- 118 మంది రోగులకు వైద్య సేవలు

**క్యాతనపల్లి - మహా** : రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో ఓమ్ని హాస్పిటల్, కూకట్‌పల్లి వారి ఆధ్వర్యంలో ఆదివారం సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించారు. డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. మధుకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో కార్డియాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, నెఫ్రాలజీ విభాగాల వైద్య నిపుణులు 118 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు అందించారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ నల్లజాల రాధాకృష్ణ శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ ఎం.డి. మదర్ సాహెబ్, మ్యాట్రన్ టి. విజయలక్ష్మి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అడవుల్లో తొలిసారి జంగిల్ సఫారీ మారథాన్ కు అనూహ్య స్పందన

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : మంచిర్యాల జిల్లా అటవీ అందాలను ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఏర్పాటు చేసిన తొలి ఫారెస్ట్ సఫారీ మారథాన్ అట్టహాసంగా జరిగింది. హాజీపూర్ మండలం గడ్పూర్ శివారులోని ఏసీసీ క్వారీ పరిసర అటవీ ప్రాంతంలో నిర్వహించిన ఈ పరుగు పందెం ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంది. జిల్లా అటవీ శాఖ, జీటీఆర్ (గ్రీన్ సీక్వర్) ఫౌండేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఉదయం 5 గంటల నుండే రన్నర్లు గడ్పూర్ ఎంట్రీ పాయింట్ వద్దకు చేరుకున్నారు. మంచు కమ్మిన అటవీ దారులు, రాతి నేలలు, కొండ కోనల మధ్య, చారిత్రక గాంధారి కోట నేపథ్యంలో సాగిన మారథాన్ అందరికీ మధుర అనుభూతిని మిగిల్చింది. ఈ మారథాన్ లో 5 కిలో మీటర్లు (8 ఏళ్లు పైబడిన వారికి), 10 కిలోమీటర్లు (14 ఏళ్లు పైబడిన వారికి), 30 కిలోమీటర్లు (18 ఏళ్లు పైబడిన వారికి) అనే మూడు విభాగాల్లో పోటీలు జరిగాయి.

**జాతీయ, అంతర్జాతీయ రన్నర్ల సందడి**

ఈ మారథాన్ కు తెలంగాణ నుండే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల నుండి, అంతేకాకుండా జర్మనీ, ఆస్ట్రేలియా దేశాల నుండి సుమారు 300 మందికి పైగా రన్నర్లు హాజరయ్యారు. ఈ ఈవెంట్ ను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారామ్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాధవ్ జెండా ఊపి ప్రారంభించారు.

**పర్యాటకం, పర్యావరణమే లక్ష్యం**

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మంచిర్యాల అడవుల్లో ఉన్న జీవ వైవిధ్యం, పర్యాటక సామర్థ్యాన్ని ప్రపంచానికి తెలియజేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే ఈ మారథాన్ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి టీషర్ట్, మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. గాంధారి వనంలో రన్నర్ల పేరిట మొక్కలు నాటారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా అంబులెన్స్ లు, మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అటవీ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.





# వాతావరణ మార్పులతో విద్యుత్తు, వ్యవసాయ రంగాలకు సవాళ్లు

- **ప్రత్యామ్నాయంగా సౌర విద్యుత్తు వినియోగాన్ని పెంచుకోవాలి**
- **సత్తుపల్లి పర్యటనలో మంత్రి తుమ్మల సూచన**

**సత్తుపల్లి, అక్టోబరు 11 (మహా)**: వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో విద్యుత్తు, వ్యవసాయ రంగాలు సవాళ్లు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగంపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఇళ్లపై, అందుబాటులో ఉన్న స్థలాల్లో సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఆదివారం పర్యటించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయకుమార్‌తో కలిసి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం వేంసూరు మండలం కల్లూరు గూడెంలో నిర్మాణంలో ఉన్న పామాయిల్ కర్మాగారం పనులను పరిశీలించి, పురోగతిని సమీక్షించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో వాతావరణ మార్పులు, విద్యుత్తు అవసరాలు, వ్యవసాయ రంగంపై వాటి ప్రభావం గురించి మంత్రి మాట్లాడారు.

**సౌర విద్యుత్తుతో ప్రత్యామ్నాయ మార్గం**

ఉష్ణోగ్రతలు పెరిగే పరిస్థితుల్లో విద్యుత్తు వినియోగం పెరిగే అవకాశం ఉందని, వర్షపాతంలో మార్పులు చోటుచేసుకుంటే జల విద్యుదుత్పత్తికి అవసరమైన నీటి లభ్యతపై ప్రభావం పడవచ్చని మంత్రి వివరించారు. ఈ నేపథ్యంలో సౌర విద్యుత్తు వంటి ప్రత్యామ్నాయ వనరులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

**సాగులోనూ ముందుచూపు అవసరం**

వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయ రంగంపై పడే అవకాశం ఉన్నందున రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నీటి లభ్యతను అంచనా వేసుకొని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని పిలుపునిచ్చారు.

**వచ్చే నెలలో పామాయిల్ కర్మాగారం ప్రారంభించే అవకాశం**

కల్లూరు గూడెంలో నిర్మిస్తున్న పామాయిల్ కర్మాగారం పనులను త్వరితగతిన పూర్తి చేసి, వచ్చే నెలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పామాయిల్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆలపాటి ప్రసాద్, ఆయిల్‌ఫెడ్ ప్రతినిధి ఎన్. శ్రీకాంత్‌రెడ్డి, ఫ్యాక్టరీ ఇన్‌ఛార్జి పవన్‌కుమార్, రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, కల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ, పలువురు అధికారులు, మంత్రి అభిమానులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ ఈటల

**కుషాయిగూడ, మహా** : కుషాయిగూడ సమీపంలో ఈ నెల 6వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బండ్లగూడ రామలింగేశ్వర కాలనీకి చెందిన పబ్బోజు మురళి కార్తీక్ మృతి చెందారు. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం మృతుడి తండ్రి విజయేందర్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, వెంకట్ రెడ్డి, కీసర బీజేపీ అధ్యక్షుడు బాలరాజ్, దమ్మాయిగూడ బీజేపీ అధ్యక్షుడు నరేశ్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొని మృతుడి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.



## కుషాయిగూడలో వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**కుషాయిగూడ, మహా** : కుషాయిగూడ: శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దేవి శరన్నవరాత్రి (దసరా) ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయ అర్చకులు కలకోట వెంకటరమణాచార్యులు, ఆరుట్ల నారాయణాచార్యులు, వేణుగోపాలాచార్యులు, బిట్కూరి లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, కలశ స్థాపన, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలను నిర్వహించారు. దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

# చీకటి సూర్యుల చెమట కష్టానికి ప్రతిఫలం ఎక్కడ.!

- **సింగరేణి సంస్థకు సీఐటీయూ సూటి ప్రశ్న**



**మందమర్రి, మహా** : సింగరేణి కాలరీస్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న చీకటి సూర్యుల చెమట కష్టానికి ప్రతిఫలం ఎక్కడ.? ఉందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఉప ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్, బ్రాంచ్ అధ్యక్షులు ఎస్. వెంకటస్వామి లు ప్రశ్నించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కోల్ బెల్ట్ వ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మందమర్రి మార్కెట్ ఏరియా నుండి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ తీసి, బస్టాండ్ వద్ద నల్ల జెండాలతో నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కార్మికులను చీకటి సూర్యులు అంటూ గొప్పలు చెప్పిన ప్రజా ప్రతినిధులు, నేడు గత ఆర్థిక సంవత్సర లాభాలను ప్రకటించడంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో సింగరేణి యాజమాన్యాన్ని తమ కనుసన్నల్లో నడిపించిన, కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రాజకీయ జోక్యాన్ని పెంచి పోషిస్తోందని విమర్శించారు. కార్మికులు చెమటోడ్చి, రక్తాన్ని ధారపోసి సంస్థకు లాభాలు తెస్తుంటే, గత రెండేళ్లుగా అభివృద్ధి నిధుల పేరుతో లాభాలను పక్కకు పెట్టి, కనీసం రక్షణ పరికరాలు కూడా ఇవ్వలేని దుస్థితి తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రభుత్వానికి డివిడెండ్ ప్రకటించడంలో చూపిన శ్రద్ధ, కార్మికుల లాభాల వాటా విషయంలో ఎందుకు చూపడం లేదని నిలదీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుబంధ సంఘాలు కార్మిక వ్యతిరేక విధానాలను పట్టించుకోకపోవడం వల్లనే సింగరేణి సంస్థకు తీవ్ర నష్టాలు వాటిల్లుతున్నాయని అన్నారు. వారం రోజులుగా అన్ని యూనియన్లు గనులపై నిరసనలు తెలుపుతున్నా యాజమాన్యం, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల పారిశ్రామిక సంబంధాలు దెబ్బతిని ఉత్పత్తి కుంటుపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికైనా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి కార్మికుల కష్టానికి తగిన ప్రతిఫలాన్ని వాటా రూపంలో అందజేయాలని, లేనిపక్షంలో కోల్ బెల్ట్ ఎమ్మెల్యేల గృహాలను ముట్టడిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దెబ్బటి శ్రీనివాస్, లింగాల సత్యనారాయణ, జడల ప్రవీణ్, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ ధనిశెట్టి సురేష్, పిట్ సెక్రటరీలు నాగవెల్లి శ్రీధర్, బుద్ధ సురేష్, పసునూటి శ్రీకాంత్, బెతి భరత్, పిట్ కమిటీ సభ్యులు, కార్మికులు, సోషల్ మీడియా ఇన్చార్జి కలవల శ్రీనివాసులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎంఎస్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సిల్వర్ జూబ్లీ వేడుకలు

**కుషాయిగూడ, మహా** : లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్-మీర్ పేట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎస్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి 25వ వార్షికోత్సవం (సిల్వర్ జూబ్లీ) వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాధిక థియేటర్ సమీపంలో ఈ కార్యక్రమం జరిగింది. పాతికేళ్లుగా ప్రజలకు కంటి వైద్య సేవలందిస్తున్న ఆసుపత్రి ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది హాజరయ్యారు.

ఈ వేడుకలకు లయన్స్ క్లబ్ మాజీ అంతర్జాతీయ డైరెక్టర్ డాక్టర్ గట్టమనేని బాబు రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ లయన్ ఏ. అమర్‌నాథ్ రావు, జిల్లా గవర్నర్ లయన్ కల్లెం కృష్ణారెడ్డి గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా లయన్ కే. హరీశ్ రెడ్డి, లయన్ కే. ఇన్నా రెడ్డి, లయన్ మంద సురేశ్ కుమార్, లయన్ గుంటుక శేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

**పాతికేళ్లుగా కంటి వైద్య సేవలు**

లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్-మీరిపేట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎస్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్వీపీఈఐ) అనుబంధ సంస్థగా కంటి వైద్య సేవలందిస్తోంది. కంటి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ లయన్ చింతల రాంచందర్, కార్యదర్శి లయన్ పొలాస రమేశ్, కోశాధికారి లయన్ ఎస్. ఆంజిరెడ్డి పాల్గొన్నారు. ఆసుపత్రి సేవలను మరింత విస్తరించడం, భవిష్యత్తులోనూ ప్రజలకు మెరుగైన కంటి వైద్య సేవలు అందించడం వంటి అంశాల్లో సిల్వర్ జూబ్లీ వేడుకలు ప్రాధాన్యాన్ని చాటాయి. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఢిల్లీలో సిపిఎం నాయకుల అక్రమ అరెస్టులు దుర్మార్గం.!

- **దుర్మార్గమైన చర్యకు పాల్పడిన కేంద్ర ప్రభుత్వం.!**
- **జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి.?**
- **డిమాండ్ చేసిన సిపిఎం జిల్లా కార్యదర్శి సామెల్**



**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 11 మహా**: ఢిల్లీలో అక్రమ అరెస్టును ఆపాలని, సిపిఎం జిల్లా కార్యదర్శి సామెల్ డిమాండ్ చేశారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామ చేయాలని, ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులను, యువజన, విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ, ఆదివారం ఇబ్రహీంపట్నంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సామెల్ మాట్లాడుతూ... ఢిల్లీలో శాంతియుతంగా ప్రదర్శన నిర్వహిస్తున్న సిపిఎం అఖిల భారత కార్యదర్శి ఎంఏ బేబీ పొలిట్, బ్యూరో సభ్యులు బివి రాఘవులు, అరుణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి ఇతర కేంద్ర కమిటీ సభ్యులను, యువజన, విద్యార్థి నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు సరైనది కాదన్నారు. సిపిఎం కేంద్ర కార్యాలయాలపై పోలీసులు దాడి చేసి పార్టీ నాయకులను, కార్యకర్తలను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. జ్ఞానేష్ కుమార్ మోడీకి ఒక ఏజెంట్ గా వ్యవరిస్తున్నారని విమర్శించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. బిజెపికి వ్యతిరేకంగా ఉన్నారనే సాకుతో ముస్లిం, క్రిస్టియన్స్, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ఓట్లను దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను రద్దు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గపు చర్యకు నిరసనగా విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జ్ఞానేష్ కుమార్ తో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడాలని, లేని పక్షంలో ఎన్నికల కమిషనర్ తో పాటు మోడీ కూడా రాజీనామా చేయాలనే డిమాండ్ దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, మాజీ జెడ్పిటిసి పగడాల యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులు బుగ్గరాములు, జగన్, అంజయ్య, గోరెంకల నర్సింహ, మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గరాములు, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ, సీపీఎం నాయకులు ఆమనగంటి వెంకటేష్, ప్రభుదాసు, ప్రకాష్ కరత్, మహేష్, సాయికుమార్, విజయ్, యాదగిరి, శివ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# గుడికో జమ్మి చెట్టు కార్యక్రమంలో ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా**: గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా చేపట్టిన 'గుడికో జమ్మి చెట్టు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. రాజీవ్ నగర్‌లోని ఎర్ర పోచమ్మ ఆలయ ప్రాంగణంలో జమ్మి మొక్కను నాటారు. మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు పెద్ద పండుగగా జరుపుకునే దసరాకు ముందు పవిత్రంగా భావించే జమ్మి చెట్లను నాటడం ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. aఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రతినిధి భోజ నారాయణ, స్థానిక నాయకులు వంజరి ప్రవీణ్, కరిపే, పాకాల ఎల్లయ్య, శివరాత్రి రాజయ్య, గొల్లెన కొమురయ్య, బొడ్డు శ్రీనివాస్, సురేష్, శివరాత్రి రాజు, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## శంషాబాద్ విమానాశ్రయంలో ఇండిగో విమానం ఎమర్జెన్సీ లాండింగ్

**- ప్రయాణికుడి పవర్ బ్యాంక్‌లో అకస్మాత్తుగా శిలరేగిన మంటలు.**

రాజేంద్రనగర్ మహా ; శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో విమానం అత్యవసరంగా ల్యాండింగ్ అయింది. ఢిల్లీ నుండి చెన్నై వెళుతున్న ఇండిగో విమానం (6ఈ 6115) లో ప్రయాణికుడి పవర్ బ్యాంక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. ఎయిర్ క్రాఫ్ట్ లోని ఫైర్ సేఫ్టీ తో మంటలను ఆర్పివేశారు. చెన్నై వెళ్లాల్సిన విమానంలో మంటలు చెలరేగడంతో హైదరాబాద్ కు దారి మళ్ళించి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో ఎమర్జెన్సీ లాండింగ్ చేశారు. ప్రయాణికులు క్షేమంగా ఉండడంతో ఏర్పోర్ట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పవర్ బ్యాంక్ ప్రమాదంపై అధికారులు చర్యలు చేపట్టారు.

# గురునానక్ లో ఘనంగా ముగిసిన 'టెక్ హోరిజోన్'

ఇబ్రహీంపట్నం అక్టోబర్ 11 మహా: ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థలో ఐఈఈఈ, జీఎన్ఐ ఆధ్వర్యంలో, సిఎస్సి (సైబర్ సెక్యూరిటీ), సిఎస్సి (డేటా సైన్స్) విభాగాల సహకారంతో నిర్వహించిన 'టెక్ హోరిజోన్ 2.0 - జాతీయ స్థాయి హ్యాకథాన్ 2026' విజయవంతంగా ముగిసింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో 11 రాష్ట్రాలకు చెందిన 294 బృందాల నుంచి 1,331 మంది విద్యార్థులు పాల్గొని, 12 సాంకేతిక రంగాల్లో వినూత్న పరిష్కారాలను ప్రదర్శించారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్సీఐ) డైరెక్టర్ కల్నల్ హర్పాల్ సింగ్ గ్రేవాల్ ముఖ్య అతిథిగా పాల్గొని, వాస్తవ ప్రపంచ సమస్యలకు వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. గురునానక్ యూనివర్సిటీ ఛాన్సలర్, గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, గురునానక్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్.ఎస్. సైనీ పాల్గొని, విద్యార్థులందరికీ తమ సందేశంలో శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి ఉత్సాహం, సృజనాత్మకత, ఆవిష్కరణాత్మక ఆలోచనలను అభినందించారు. బహుమతి విజేతలు: టీమ్ నోవాజెనెసిస్ ప్రథమ బహుమతిగా 1,25,000 గెలుచుకోగా, టీమ్ ఇన్ఫినిటీ ద్వితీయ బహుమతిగా 50,000, టీమ్ ది నైన్ గైస్ తృతీయ బహుమతిగా 25,000 గెలుచుకున్నాయి. వివిధ సాంకేతిక రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బృందాలకు ఒక్కొక్కరికి 13,000 చొప్పున డొమైన్ ఎక్సలెన్స్ అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీఎన్ఐటీసీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. శ్రీనాథ రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ రిషి సయాల్, డీన్ - ఆర్ అండ్ డీ డాక్టర్ ఎస్.వి. రంగనాయకులు, సీ ఎస్ ఈ (సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్) విభాగాధిపతి డాక్టర్ సి. సుబ్బలక్ష్మి పాల్గొన్నారు. ఈ హ్యాకథాన్ విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలు, బృంద స్ఫూర్తి, పరిశ్రమలు-విద్యాసంస్థల మధ్య సహకారాన్ని ప్రోత్సహించింది. భవిష్యత్ సాంకేతిక నాయకులను తీర్చిదిద్దడంలో జీఎన్ఐటీసీ తన నిబద్ధతను మరోసారి చాటుకుంది.



# శ్రీ కనకదుర్గమ్మ. ఆలయంలో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

- తొలిరోజు బాలా త్రిపుర సుందరీ దేవిగా అమ్మవారి దర్శనం
- పూలతో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు



**కుషాయిగూడ, మహా** : సోనియా గాంధీ నగర్ .శ్రీ కనకదుర్గమ్మ. ఆలయంలో విజయ దశమి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. ఆలయాన్ని పూలతో సుందరంగా ముస్తాబు చేశారు. నవరాత్రుల తొలిరోజున అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి (శైలపుత్రి) రూపంలో సూర్యప్రభ అలకంరణ చేశారు. బాలా త్రిపుర సుందరీ దేవి అవతారం శక్తి, జ్ఞానం, ధైర్యం, నిర్మలత్వానికి ప్రతీక. శరన్నవరాత్రుల ఆరంభంలో ఈ బాలరూపాన్ని ఆరాధించడం ద్వారా దైవభక్తితోపాటు మంచి విలువలను జీవితంలో ఆచరించాలనేది సందేశం. బాలా త్రిపుర సుందరీ దేవి ఆరాధన మనిషిలోని నిర్మలత్వాన్ని మేల్కొలిపి, జ్ఞానమార్గంలో నడిపిస్తుందని భక్తుల విశ్వాసం. దుర్గమ్మ అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమివ్వడం భక్తులకు కనువిందు చేసింది. తొలిరోజు వందలాది మంది .భక్తులతో శ్రీ మహాశక్తి దేవాలయం కిటకిటలాడింది. ఉదయం 11 గంటలకు ధ్వజరోహణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు.నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాన్ని దర్శించుకున్న వేలాది మంది భక్తులు, ముఖ్యంగా భవానీ దీక్షాపరులకు ఆలయ నిర్వాహకులు మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందించారు. నవరాత్రులు ముగిసే వరకు భోజనం, అల్పాహారం అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు ప్రతి రోజు సాయంత్రం అధ్యాత్మిక భావన, భక్తి పాటలతో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ''దాండియా'' కార్యక్రమం నిర్వహించనున్నారు.

# రూ.31 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం..

- రంజాన్ షెడ్డు, సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- అన్ని వర్గాల సంక్షేమం, మౌలిక వసతుల కల్పనే లక్ష్యమని వెల్లడి



**మణుగూరు, మహా** : ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో రూ.31 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. కూరగాయల మార్కెట్ సమీపంలోని మసీదు వద్ద రూ.6 లక్షలతో నిర్మించిన రంజాన్ షెడ్డును, శివలింగాపురంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం వద్ద రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ముస్లిం సోదరుల సౌకర్యార్థం రంజాన్ షెడ్డు నిర్మించడం సంతోషకరమన్నారు. శివలింగాపురంలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్ నిర్మాణంతో స్థానిక ప్రజలతోపాటు ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, అంగన్‌వాడీ చిన్నారులు, తల్లిదండ్రులకు రాకపోకలు సులభతరమవుతాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీరు నిలవకుండా, మురుగునీరు సక్రమంగా పారేందుకు డ్రైనేజీ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ప్రతి గ్రామం, వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో అభివృద్ధి ఫలాలు ప్రతి ప్రాంతానికి చేరేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో మైనారిటీ అధ్యక్షుడు రహీం పాషా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మైనారిటీ, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ గెలుపు కోసం కృషి.

**చంద్రపురి కాలనీ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా రాహుల్ ఎన్నిక.**

**జవహర్ నగర్, మహా**: జవహర్ నగర్ లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నిరంతరం కృషి చేస్తానని చంద్రపురి కాలనీ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాహుల్ కదం పేర్కొన్నారు. చంద్రపురి కాలనీ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రాహుల్ నియమితులయ్యారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారితో వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అర్హులకు అందే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసి కట్టుగా ఉండి రాబోయే రోజుల్లో పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గెలుపు కోసం ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు... అనంతరం నూతనంగా నియమితులైన రాహుల్ మాట్లాడుతూ నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం జవహర్ నగర్ లో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. నాపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నయ్య కు డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తో పాటు సహకరించిన నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గడ్డం శ్రీనివాస్, ఏ బ్లాక్ అధ్యక్షులు మాట్ల శ్రీనివాస్, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్త, సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్, మాట్ల వినయ్ కుమార్, వెంకటేష్, నాయకం భాస్కర్, కాలేషా, సోమేశ్వారి, గణేష, రఫిక్ తదితరులు పాల్గొన్నారు



# సమాజంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకం

- అభివృద్ధిలో యువత ముందంజలో ఉండాలి
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్

**జవహర్ నగర్, మహా** : సమాజంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని, అభివృద్ధిలో యువత ముందు వరసలో నిలబడాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్ పేర్కొన్నారు ఆదర్శనగర్లో సిపిఐ శాఖ పునర్నిర్మాణ మహాసభ ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ హాజరయ్యారు. ఈ సందర్భంగా దశరథ మాట్లాడుతూ సమాజంలో సంఘంలో యువత భాగస్వామ్యం ఎంతో కీలకమని స్థానిక అభివృద్ధిలో యువత ముందు వరుసలో నిలబడాలని పిలుపునిచ్చారు. బస్తీ సమస్యలు ఆదర్శనగర్ లో ప్రాథమిక సౌకర్యాలు స్థానికంగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ప్రజల అవసరాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆదర్శనగర్ శాఖ పునర్నిర్మాణంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి నూతన కమిటీ సభ్యులను ప్రకటించారు. ముఖ్య కార్యదర్శిగా పోలోజు కిరణ్ కుమార్ సహాయ కార్యదర్శిగా గట్టు చిరంజీవి, కార్యవర్గ సభ్యులుగా పోలోజు బాలాచారి, వద్ల పాండు, అశోక్ చారి, కృష్ణ, చెన్నయ్య తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు బస్తీ సమస్యలపై నిరంతరం శ్రమిస్తూ ప్రజా ప్రయోజనాల కోసం అందుబాటులో ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో 20 మంది సెక్యూరిటీ గార్డుల నియామకం

**సత్తుపల్లి, అక్టోబరు 11**:మహా : సింగరేణి సత్తుపల్లి ఏరియా ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా సిబ్బంది నియామకానికి లక్ష్మీ నరసింహ సెక్యూరిటీ ఏజెన్సీ ఆదివారం ప్రకటన విడుదల చేసింది. సింగరేణి ఎస్ అండ్ పిసి శాఖ సమక్షంలో 20 మంది ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించింది. ఈ నియామకాల్లో భూనిర్వాసిత కుటుంబాలకు 50 శాతం, డిపెండెంట్లు, విశ్రాంత ఉద్యోగుల పిల్లలు, స్థానిక అర్హులకు మిగిలిన 50 శాతం అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొంది.

**అర్హతలు ఇవీ..బ**

పదో తరగతి ఉత్తీర్ణులై, 25 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు కనీసం 5.3 అడుగుల ఎత్తు ఉండాలని, నిర్దేశించిన శారీరక ప్రమాణాలతోపాటు 1.6 కిలోమీటర్ల పరుగు పందెంలో అర్హత సాధించాల్సి ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

**13, 14 తేదీల్లో దరఖాస్తుల స్వీకరణ..**

అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు పదో తరగతి ధ్రువపత్రం, ఆధార్ కార్డు, భూనిర్వాసితులైతే సంబంధిత ధ్రువపత్రాల అసలు ప్రతులను సమర్పించాలని సూచించారు. ఈ నెల 13, 14 తేదీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17న ఉదయం 6 గంటలకు శారీరక పరీక్షలు నిర్వహించి, అర్హులైన 20 మందిని ఎంపిక చేయనున్నట్లు లక్ష్మీ నరసింహ సెక్యూరిటీ ఏజెన్సీ ప్రతినిధి ప్రకటనలో వెల్లడించారు.

# చట్టంపై అవగాహన పెంచాలి

- సంఘాన్ని బలోపేతం చేయాలి
- జాతీయ చైర్మన్ చంటి ముదిరాజ్
- రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి
- సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా కార్యదర్శిగా రామ్ ప్రతాప్
- నియామక పత్రాన్ని అందించిన కార్పొరేటర్ జల్లి శ్రీలక్ష్మి
- ప్రతాప్ కి శుభాకాంక్షలు తెలిపిన పొన్నెకంటి




**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శిగా రామ్ ప్రతాప్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయనను జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి మాట్లాడుతూ రామ్ ప్రతాప్ కు అప్పగించిన బాధ్యతలను అంకితభావం దీక్ష పట్టుదలతో నిర్వర్తించాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీని జిల్లాలో మరింత బలోపేతం చేయడంతో పాటు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు త్వరలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న హక్కులు అవకాశాలపై విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. ఇదిలా ఉండగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ కార్పొరేటర్ జల్లి శ్రీలక్ష్మి నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యదర్శి రామ్ ప్రతాప్ కు నియామక పత్రం అందించి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు పొన్నెకంటి జయకుమారి, కుష్మి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పొన్నెకంటి సంజీవరాజు, సామల కృష్ణవేణి, కంచం రజిత తదితరులు పాల్గొన్నారు.



# మణుగూరులో ఘనంగా భద్రాద్రి దశాబ్ది ఉత్సవాలు..

- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ..
- ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు
- 40 మంది తెలంగాణ ఉద్యమకారులకు ఘన సన్మానం..

**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం మణుగూరులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని సురక్ష బస్టాండ్ నుంచి అంబేడ్కర్ వరకు నిర్వహించిన ర్యాలీని రేగా కాంతారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పాటై దశాబ్ద కాలం పూర్తికావడం సంతోషకరమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల పోరాటాలు, త్యాగాలు మరువలేనివని తెలిపారు. అనంతరం రేగా కాంతారావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ తదితర నాయకులు పినపాక నియోజకవర్గానికి చెందిన 40 మంది తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉద్యమంలో వారి సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.



## దివ్యసాకేత క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**రాజేంద్రనగర్ మహా** ; శంషాబాద్ మండలం ముచ్చింతల్ లోని శ్రీరామ్నగర్ లో స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంగణంలో మొదటి రోజు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి అలంకరణలో భక్తులకు దివ్య దర్శనంతో, శ్రీ సాకేత రామచంద్రునికి విశేష అభిషేకం శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 11 నుండి అక్టోబర్ 20 వరకు దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత ఆధ్యాత్మిక శోభ మధ్య కన్నులపండువగా కొనసాగనున్నయి. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజైన ఆదివారం ఉదయం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అమ్మవారి అలంకరణలో భక్తులకు దివ్య దర్శనం ప్రసాదించారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రాంగణంలో విశేషమైన శ్రీయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ఈ యాగ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. చిత్తా నక్షత్రం పర్వదినం కావడంతో శ్రీ సాకేత రామచంద్రుడికి వైభవంగా ప్రత్యేకంగా అభిషేకం నిర్వహించారు.




# సింగరేణి లాభాలు ప్రకటించాలి..

- కార్మికులకు 35 శాతం బోనస్ ఇవ్వాలి..
- రైల్వేగేటు వద్ద సీఐటీయూ రాస్తారోకో..

**మణుగూరు, మహా** : సింగరేణి యాజమాన్యం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలను తక్షణమే ప్రకటించి, కార్మికులకు 35 శాతం లాభాల వాటా బోనస్‌గా చెల్లించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు మాచారపు లక్ష్మణరావు, వల్లూరు వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఆదివారం మణుగూరు సమీపంలోని కూనవరం రైల్వేగేటు వద్ద యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాల అమలు సంస్థ ఆర్థిక పరిపుష్టిపైనే ఆధారపడి ఉన్నాయని పేర్కొన్నారు. మెడికల్ ఇన్వాలిడేషన్, మారుపేర్ల సమస్యలు, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను రీయింబర్స్‌మెంట్, సొంతింటి పథకం వంటి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికులకు మెరుగైన పని పరిస్థితులు కల్పించడంతోపాటు రక్షణ పరికరాలు, ఆధునిక యంత్రాలు, విడిభాగాలు, పనిముట్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు ట్రాన్స్‌కో నుంచి రావాల్సిన రూ.27 వేల కోట్లు, జెన్‌కో నుంచి రావాల్సిన రూ.19 వేల కోట్లు కలిపి మొత్తం రూ.46 వేల కోట్ల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన బకాయిలను వసూలు చేయడం ద్వారా సంస్థ ఆర్థిక స్థితిని బలోపేతం చేయవచ్చని తెలిపారు. సింగరేణి పరిరక్షణతోపాటు కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బకాయిల చెల్లింపు కోసం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ ధర్నాను విజయవంతం చేసిన కార్మికులు, నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కోల్ ఇండియా వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ సభ్యుడు ముత్యాల సుమన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయికృష్ణ, ముజాఫర్, బొల్లం రాజు, గుర్రం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## పండుగకు ఊరెళ్తున్నారా?

**ఇళ్లకు రక్షణగా ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

**ఎస్సై శ్రీకాంత్ రెడ్డి**

వలిగొండ అక్టోబర్ 10 మహా న్యూస్ : బతుకమ్మ మరియు దసరా పండుగ సెలవుల సందర్భంగా తమ స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు తగిన భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సూచించారు. పండుగ రద్దీని ఆసరా చేసుకుని దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు పోలీసులు పలు ముఖ్యమైన సూచనలు జారీ చేశారు విలువైన వస్తువులు ఇంట్లో నగలు నగదు వంటి విలువైన వస్తువులను వీలైనంత వరకు వెంట తీసుకెళ్లడం మంచిదని లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని తెలిపారు. తాళాలుభద్రతఇళ్లకు పటిష్టమైన తాళాలు వేసి వెళ్లాలని,ఇంటి వద్ద సీసీ కెమెరాలుCCTV Cameras మరియు మోషన్ అలారాలు సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలని సూచించారు. సమాచారం ఇవ్వండి పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు అత్యవసర నంబర్ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే తక్షణ సహాయం కోసం స్థానిక పోలీసులను సంప్రదించాలని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.




# పెద్దపల్లి జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు.. ప్రగతి ప్రస్థానంలో మరో మైలురాయి!

**జిల్లా ఏర్పాటు చేసిన కేసీఆర్‌కు బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష కృతజ్ఞతలు**

**పెద్దపల్లి మహా :** ద్దపల్లి జిల్లా ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 2016 అక్టోబర్ 11న విజయదశమి పర్వదినాన పెద్దపల్లి జిల్లా ఆవిర్భవించగా, 2026 అక్టోబర్ 11 నాటికి పదేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా పెద్దపల్లిలో 5కే రన్ నిర్వహించారు. పెద్దపల్లిని జిల్లాగా ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు దాసరి ఉష తో పాటు బి ఆర్ ఎస్ నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్లలో జిల్లాలో సమీకృత జిల్లా కలెక్టరేట్, మాతా శిశు ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, బస్ డిపో, సాగునీటి సదుపాయాలు, గ్రామీణ రహదారులు, మినీ ట్యాంక్‌బండ్‌ల వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు.సాగునీటి సౌకర్యాల విస్తరణతో వ్యవసాయ రంగంలోనూ పురోగతి సాధించామని, వరి సాగు, ధాన్యం ఉత్పత్తి పెరగడం జిల్లాకు ప్రయోజనకరంగా మారిందని తెలిపారు. "పెద్దపల్లి జిల్లా ఆవిర్భావానికి పదేళ్లు.. మన పెద్దపల్లి ప్రగతికి పదేళ్లు" అనే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ జిల్లా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పెద్దపల్లి జిల్లా ఏర్పాటుకు కృషి చేసిన కేసీఆర్‌కు మరోసారి ధన్యవాదాలు తెలిపారు.

# నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

**వలిగొండ అక్టోబర్ 11 మహా న్యూస్ :** ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం లోటు మరియు ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు ఏర్పడినందున రానున్న యాసంగి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు పంటల ప్రణాళిక గూర్చి మరియు రైతు సోదరులను ఉద్దేశించి నేడుసోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం 11 గంటలకు ఉంటుందని వలిగొండ వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు కావున ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం లైవ్ వీడియో కాన్ఫరెన్స్ ప్రసారం ఉన్నందున అరూర్ క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల రైతులు ప్రజాప్రతినిధులు అధికారులు అందరు వలిగొండ రైతు వేదికకు ఉదయం 11 గంటలకు విచ్చేసి కార్యక్రమాన్ని వీక్షించవలసిందిగా వ్యవసాయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు



# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉద్యమకారులు ఓటు నమోదు చేసుకోవాలి

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ , జోగు అంజయ్య ఉపాధ్యక్షులు**

**భువనగిరి అక్టోబర్ 11 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఉపాధ్యక్షులు జోగు అంజయ్య లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగు రెండు ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలంగాణ ఉద్యమకారుల గొంతు వినిపించుటకు ఉద్యమ నేపథ్యమున్న నాయకుని ఎన్నుకొని ఉద్యమకారుల సమస్యలపై శాసనమండలిలో ప్రస్తావించుట కోసం ఉద్యమకారుల కుటుంబ సభ్యులు బంధుమిత్రులు డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాల్సిందిగా వారు కోరారు. ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాల్సిందిగా డిగ్రీ అర్హత ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యమకారుల నేపథ్యమున్న నాయకుడిని ఎమ్మెల్సీగా ఎన్నుకొని శాసనమండలిలో ఉద్యమకారుల గొంతు వినిపించడానికి ఉద్యమకారుల ఐక్యతను చాటడానికి తెలంగాణ ఉద్యమకారులకు కుటుంబాలలో డిగ్రీ ఉత్తీర్ణత ఉన్న ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకొని రాబోయే ఎన్నికల్లో ఉద్యమకారుల సత్తాను చాటాలన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు బోల్ల జగన్, వెంగళ భాస్కర్, రామచర్ల బాల నర్సయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధులు, జిల్లా అధికార ప్రతినిధి సోమారపు శంకర్, సీనియర్ ఉద్యమకారులు కొండూరు శ్రీరాములు, గణేష్, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# రైతు సంక్షేమం.. గ్రామాభివృద్ధే లక్ష్యం

- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**కరీంనగర్ మహా :** మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సహకార సంఘాల అభివృద్ధి, రైతులకు రుణాల మంజూరు, ప్రత్యామ్నాయ పంటల సాగు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై పలు సూచనలు చేశారు. తిమ్మాపూర్ మండలం పోరండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా గోపు తిరుపతిరెడ్డి, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, రైతులకు రుణాల మంజూరులో ఇబ్బందులు కల్పించవద్దని సూచించారు. లాభాల్లో కొనసాగుతున్న సంఘాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు కూరగాయల సాగు రైతులను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి అక్బరుద్దీన్, సర్పంచ్ అసోద శ్రీనివాస్, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, పీఏసీఎస్ చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, ఒగ్గు దామోదర్, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, గోపు మల్లారెడ్డి, చింతల తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, ఉంటా రాజేందర్‌రెడ్డి, ద్యావ శ్రీనివాస్‌రెడ్డి, పులి కృష్ణ, లింగాల శ్రీనివాస్, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, రావుల కృష్ణగౌడ్, అయితం వెంకన్న, పొన్నాల సంపత్, కేతిరెడ్డి లింగారెడ్డి, మేడి అంజయ్య, పోలు రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు. మానకొండూరు మండలం ఖాదర్‌గూడెంలో కనవేని కొమురయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ తక్కువ నీటితో అధిక ఆదాయాన్నిచ్చే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు సొంత నిధులతో ప్లాంట్ ఏర్పాటు చేసిన సర్పంచ్ కనవేని అక్షయ, శ్రీనివాస్ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు అంకుస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాద శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రసాద్ శ్రీనివాసరెడ్డి, సీఐ శ్రీలత, ఏఎంసీ మాజీ చైర్మన్ మరవెల్లి యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, రేమిడి శ్రీనివాసరెడ్డి, మీస సత్యనారాయణ, గొల్లెన కొమురయ్య, పేడ తిరుపతిరెడ్డి, తోట శ్రీనివాస్, బుర్ర చంద్రశేఖర్, కుంభం చిరంజీవి, కనకం అశోక్, కొండ్ర సురేష్, రేవెల్లి రాజలింగం, ముక్కెర సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మానకొండూరు మండలం అన్నారం గ్రామంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు కిషన్, మండల మహేందర్, అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. గన్నేరువరం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ లక్ష్మీనర్సు కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వార్డు సభ్యులు రాములు జన, బి. శ్రీనివాస్, దురుముట్ల శ్రీనివాస్‌లకు కూడా కండువాలు కప్పారు. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునీల్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కట్కం తిరుపతి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మసుకు ఉపేందర్‌రెడ్డి, మన్మోహన్‌రావు, కొమ్మెర రవీందర్‌రెడ్డి, మాతంగి అనిల్, సీహెచ్ శ్రీధర్‌రెడ్డి, తిరుపతి గౌడ్, ఉప సర్పంచ్ రామంచ స్వామి, విజేందర్, సతీష్, నరేందర్, పరుశరాములు, కూన కొమరయ్య, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బోయిని మల్లయ్యతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్ కుటుంబం

**రంగంపేట, మహా :** శ్రీ భద్రకాళి శరన్నవరాత్ర దసరా మహోత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కుటుంబ సమేతంగా ఆదివారం వరంగల్‌లోని శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కుటుంబ సమేతంగా విచ్చేసిన జిల్లా కలెక్టర్‌కు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు చేపట్టి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భద్రకాళి అమ్మవారి ఆలయం భక్తులతో సందడిగా మారింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో రైతులు, జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సమృద్ధిగా వర్షాలు పడాలని ఆకాంక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా ఆలయ పరిపాలన విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రకాళి ఆలయంలో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



# బహుజన అస్తిత్వ పోరాటాలను కొనసాగిద్దాం!

- బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- బహుజన బతుకమ్మ కరపత్రం ఆవిష్కరణ

**పెద్దపల్లి మహా :** ఈ నెల 15వ తేదీన పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప గుడి వద్ద నిర్వహించనున్న బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం కోరారు. ఆదివారం పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద బహుజన బతుకమ్మ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెల్తురు సదానందం మాట్లాడుతూ.. విద్యా, వైద్య రంగాల్లో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం, విద్యా వ్యాపారం, ప్రశ్నపత్రాల లీకేజీలపై యువత పోరాటాలు ఉధృతమవుతున్నాయని అన్నారు. యువతరంతో భుజం భుజం కలిపి దేశంలోని మౌలిక సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అక్టోబర్ 15న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అయ్యప్ప గుడి వద్ద బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బహుజన బతుకమ్మ నిర్మాణ కమిటీ చైర్మన్ కామ్రేడ్ విమలక్కతో పాటు అరుణోదయ సంస్థ బృందం ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బుద్ధుల రమేష్, విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, అరుణోదయ రాష్ట్ర నాయకులు సీహెచ్ యాకూబ్, తిర్రి బాలకృష్ణ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం, తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య, జిల్లా నాయకులు కే. రాజు రాజు, బహుజన సమాజ్ పార్టీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు నర్ల గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# దేవాలయ అభివృద్ధి కమిటీకి నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షులుగా కందికొండ మోహన్

**శంభుని పేట, మహా :** వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని శంభుని పేట ప్రాంతంలో గల కార్యసిద్ధి హనుమాన్ దేవాలయ అభివృద్ధి కమిటీకి తొలి పాలక వర్గాన్ని నూతనంగా ఎన్నుకున్నారు. ఆదివారం శంభుని పేట పరపతి సంఘం కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. పరపతి సంఘం అధ్యక్షులు దేవులపల్లి దయాకర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో కార్యసిద్ధి హనుమాన్ ఆలయాభివృద్ధికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షులుగా కందికొండ మోహన్, ప్రధాన కార్యదర్శిగా దేవులపెల్లి శ్రీనాథ్, కోశాధికారిగా కందగట్ల శ్రీ రామ్, ఉపాధ్యక్షులుగా జడల సురేష్ కుమార్, పస్తం రామకృష్ణ, మిర్యాల సంపత్, దేవులపల్లి సుధాకర్, శ్రీధర్, సహాయ కార్యదర్శులుగా సింధం మహేష్, మోర దిలీప్, దేవులపల్లి శ్రీకాంత్, తుర్పాటి మురళీకృష్ణ, గంధం శ్రీనివాస్, సహాయ కోశాధికారిగా జడల రాము తదితరులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యుల చే ఆలయ అర్చకులు బాబు ప్రమాణ స్వీకారం చేయించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి అధ్యక్షులు మోహన్ మాట్లాడుతూ గ్రామ పెద్దలు, పరపతి సంఘం కార్యవర్గం సహాయ సహకారాలతో కమిటీ సభ్యులం ఆలయాభివృద్ధికి కృషి చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో పరపతి సంఘం కార్యవర్గ సభ్యులు కోమాకుల పూర్ణ, పసునూటి కోటేశ్వర్, ఆడెపు చందర్, దేవులపల్లి కమలాకర్, సత్యం, శరత్, ప్రభాకర్, రవీందర్, సోమేశ్వర్, జనార్ధన్, రాజేంద్ర ప్రసాద్, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# ఐఎంఏ వరంగల్ శాఖ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**రిటర్నింగ్ ఆఫీసర్ డాక్టర్ నాగార్జున రెడ్డి**

**ఎంజీఎం మహా ;** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ శాఖ ఎన్నికల ప్రక్రియలో భాగంగా, 2026 సంవత్సరం ఎన్నికలు వరంగల్ లోని కే ఎస్ ఆర్ శాస్త్రి డాక్టర్. ఝాన్సీ దేవి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రాంగణంలో నిర్వహించబడనున్నాయి. ఈ సందర్భంగా ఎన్నికల షెడ్యూల్ ప్రకారం 28 10 2026 తేదీ నుండి నామినేషన్ ఫారాలు అందజేయబడతాయి. ఎన్నికల పోలింగ్ తేదీ: 5 11 2026, గురువారం సమయం ఉదయం 8:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఎన్నికలు నిర్వహించబడతాయని రిటర్నింగ్ ఆఫీసర్ డాక్టర్ నాగార్జున రెడ్డి,కోరిటర్నింగ్ ఆఫీసర్లు డాక్టర్ బందెల మోహన్ రావు, డాక్టర్ కె. మల్లేశం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



# ఎన్నికల సంఘంపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేసిన వ్యాఖ్యలను ఖండించిన బీజేపీ

- ఎంపీ ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం

**పెద్దపల్లి మహా :** కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీపై పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేస్తున్న ఆరోపణలను బీజేపీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం ఖండించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఢిల్లీలో గత నాలుగు రోజులుగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ చేస్తున్న వ్యాఖ్యలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను బీజేపీ ఎన్నికల కమిషనర్‌గా అభివర్ణించడం, 13 కోట్ల ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించడం ప్రజాస్వామ్య వ్యవస్థను కించపరిచేలా ఉన్నాయని పల్లె సదానందం విమర్శించారు. ఈ ఆరోపణలకు ఆధారాలు చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఎంపీ వంశీకృష్ణకు బీజేపీ ప్రశ్నలు వర్షం

ఓట్ల చోరీకి ఆధారాలు ఎక్కడ? రాహుల్ గాంధీ పేర్కొన్న 13 కోట్ల ఓట్ల చోరీ ఆరోపణలకు ఆధారాలు చూపాలని పల్లె సదానందం ప్రశ్నించారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అని, దానిపై ఆరోపణలు చేసేటప్పుడు ఆధారాలు వెల్లడించాలని అన్నారు. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై విమర్శలు చేస్తోందని ఆరోపించారు.

### పెద్దపల్లి ప్రజల కోసం ఏం చేశారు?

ఎంపీగా బాధ్యతలు చేపట్టి సుమారు 16 నెలలు గడిచినా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గానికి తీసుకొచ్చిన కేంద్ర నిధులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (RFCL), ఎన్టీపీసీ, సింగరేణి, రైల్వే లైన్ల అభివృద్ధి, జాతీయ రహదారుల వంటి అంశాలను ప్రస్తావిస్తూ, పెద్దపల్లి అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై మాట్లాడారు. పార్లమెంట్‌లో పెద్దపల్లి సమస్యలపై ఎంపీ ఎన్నిసార్లు మాట్లాడారు, ఆయన హాజరు శాతం ఎంత అని ప్రశ్నించారు.

### రాముడి పేరుతో రాజకీయాలపై విమర్శలు

రాముడి పేరుతో బీజేపీ రాజకీయాలు చేస్తోందన్న ఎంపీ వ్యాఖ్యలను పల్లె సదానందం తప్పుబట్టారు. అయోధ్య రామమందిర నిర్మాణాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ గత వైఖరిపై విమర్శలు చేశారు.

### సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం ఏది?

కాకా వెంకటస్వామి కుటుంబం పేరుతో రాజకీయ లబ్ధి పొందుతున్నారంటూ ఎంపీపై విమర్శలు చేశారు. సింగరేణి కార్మికులకు ఇంటి పట్టాలు ఇప్పిస్తామని ఇచ్చిన హామీ అమలుపై స్పష్టత ఇవ్వాలని, ఇప్పటివరకు ఎంతమందికి పట్టాలు ఇప్పించారో వెల్లడించాలని ప్రశ్నించారు.

### అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు, పెద్దపల్లి జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎంపీ వంశీకృష్ణను పల్లె సదానందం ప్రశ్నించారు. రాష్ట్రానికి పదేళ్లలో రూ.9 లక్షల కోట్ల నిధులు, పెద్దపల్లి జిల్లాకు రూ.25 వేల కోట్లకు పైగా కేంద్ర నిధులు వచ్చాయన్న వాదనలను ప్రస్తావిస్తూ, వాటిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

### ఎన్నికల సంఘానికి క్షమాపణ చెప్పాలి

ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు, దేశ ఎన్నికల వ్యవస్థకు బహిరంగ క్షమాపణ చెప్పాలని పల్లె సదానందం డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజకీయ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం కంటే పెద్దపల్లి ప్రజల సమస్యల పరిష్కారంపై ఎంపీ దృష్టి సారించాలని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు మోర మనోహర్, పెండ్యాల కుమార్, సంపత్ చారి, కోళ్ల సుధాకర్, ముస్తాల సంతోష్, బండ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.




# తెలంగాణ కొత్త జిల్లాల దశాబ్ది వేడుకలు

- ప్రజలకు పాలనను చేరువ చేసిన చారిత్రాత్మక నిర్ణయం
- మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి

**పెద్దపల్లి మహా :** తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ నెల 13న పెద్దపల్లిలో దశాబ్ది వేడుకలు నిర్వహించనున్నట్లు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి తెలిపారు. పెద్దపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు చేపట్టిందని మమతారెడ్డి పేర్కొన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనేది కేవలం భౌగోళిక సరిహద్దుల మార్పు మాత్రమే కాదని, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత కల్పించడం దీని ప్రధాన ఉద్దేశమని వివరించారు.

### పెద్దపల్లి జిల్లా ఏర్పాటు ప్రజల చిరకాల ఆకాంక్ష

పెద్దపల్లిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఈ ప్రాంత ప్రజల్లో ఎన్నో ఏళ్లుగా ఉందని మమతారెడ్డి తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో పెద్దపల్లిని జిల్లాగా ప్రకటించడంతో ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందన్నారు. జిల్లా ఏర్పాటుతో కలెక్టరేట్, రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర శాఖల జిల్లా స్థాయి కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గి ప్రజలకు సౌకర్యం కలిగిందన్నారు.

### వికేంద్రీకరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం

తెలంగాణ ఏర్పడిన తర్వాత పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేసినట్లు మమతారెడ్డి తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు దగ్గరగా ఉండటం, అధికారులు సులభంగా అందుబాటులోకి రావడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఈ మార్పుల ప్రధాన లక్ష్యాలని వివరించారు.

### పదేళ్ల ప్రగతిని సమీక్షించుకోవాలి

పెద్దపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీరు, మౌలిక వసతుల రంగాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను దశాబ్ది వేడుకల సందర్భంగా ప్రజల ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.

జిల్లా ఏర్పాటు కోసం ఉద్యమించిన ప్రజా సంఘాలు, ఉద్యమకారులు, మేధావులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, యువత సేవలను స్మరించుకోవాలని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఏర్పాటులో భాగస్వాములైన ప్రతి ఒక్కరి కృషిని గుర్తించడం మనందరి బాధ్యత అని అన్నారు.

### విష్యత్తులో మరింత అభివృద్ధికి కృషి చేయాలి

దశాబ్ది వేడుకలు కేవలం సంబరాలకే పరిమితం కాకుండా గత పదేళ్ల అభివృద్ధిని సమీక్షించుకునే వేదికగా నిలవాలని మమతారెడ్డి అన్నారు. జిల్లాలో ఇంకా అభివృద్ధి చేయాల్సిన రంగాలను గుర్తించి, ప్రజల సూచనలు, ప్రజాప్రతినిధుల సహకారం, అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

పెద్దపల్లి జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయ, విద్యా రంగాలతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి మరిన్ని అవకాశాలు ఉన్నాయని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పరిశ్రమలను విస్తరించడం, విద్యార్థులకు ఉన్నత విద్యా సదుపాయాలు అందించడం, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం, పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కేటీఆర్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న దశాబ్ది వేడుకల్లో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని ఆమె కోరారు. పెద్దపల్లి జిల్లా మరింత అభివృద్ధి చెంది ప్రజలకు మెరుగైన పాలన, సేవలు అందాలని ఆకాంక్షించారు.ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సందీప్‌రావు, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, నాయకులు శైలేంద్ర రాములు, పెంచల శ్రీధర్, పుదరి చంద్రశేఖర్, బాలసాని ఈశ్వర్ గౌడ్, జావిద్, బాలసాని శ్రీను, బిక్షపతి, పసిడ్ల సంపత్, కాశిపాక వాసు, వైద్య శీను, కిషోర్, జక్కుల శ్రీకాంత్, నూగిల వీరేశం, సర్వేశ్, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ‘బాషా 2’, ‘పేట 2’కు నో.. ‘జైలర్ 2’కు మాత్రం ఓకే!



**సీక్వెల్‌కు రజనీకాంత్ అంగీకారం వెనుక అసలు కారణమిదే!**

**మహా :** సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమాలకు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆయన నటించిన సూపర్‌హిట్ చిత్రాలకు రెండో భాగం వస్తే చూడాలని అభిమానులు ఎప్పటినుంచో కోరుకుంటున్నారు. ముఖ్యంగా ‘బాషా’, ‘పేట’ వంటి సినిమాలకు సీక్వెల్స్ వస్తాయనే ప్రచారం కూడా గతంలో జరిగింది. అయితే ఆ ప్రతిపాదనలకు అంగీకరించని తలైవా.. ‘జైలర్ 2’ విషయంలో మాత్రం ముందడుగు వేశారు. దీనికి కారణమేంటో తాజాగా వెల్లడించారు. సాధారణంగా సీక్వెల్స్ చేయడానికి పెద్దగా ఆసక్తి చూపించని రజనీకాంత్.. ‘జైలర్’ కథలో మరో భాగానికి అవకాశం ఉందని భావించారు. సినిమా ఓటీటీలో విడుదలైన తర్వాత మరోసారి వీక్షించినప్పుడు చివర్లో వచ్చే కొన్ని సన్నివేశాలు ఆయనను ఆలోచింపజేశాయి. ముఖ్యంగా వర్నా పాత్ర ద్వారా బయటపడే పెద్ద నేర నెట్‌వర్క్ ప్రస్తావన, కథ అక్కడితో పూర్తికాలేదనే భావనను కలిగించాయి. దీంతో రెండో భాగానికి సరైన కథా నేపథ్యం ఉందని ఆయన నిర్ణయించుకున్నారు.ఈ ఆలోచనతో దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్‌ను సంప్రదించి ‘జైలర్ 2’ చేయాలనే ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లారు. తొలుత దర్శకుడు కొంత సందేహించినప్పటికీ, కథపై మరింత కసరత్తు చేసిన తర్వాత ప్రాజెక్టు రూపుదిద్దుకుంది.రజనీకాంత్ కెరీర్‌లో ‘బాషా’కు ప్రత్యేక స్థానం ఉంది. ఆ సినిమాకు రెండో భాగం చేయాలంటూ గతంలో ప్రతిపాదనలు వచ్చినా ఆయన అంగీకరించలేదు. అలాగే దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ సూచించిన ‘పేట 2’ ఆలోచన కూడా ముందుకు సాగలేదు. ఒక సినిమా కథ పూర్తయిన తర్వాత అదే పాత్రలను మళ్లీ తెరపైకి తీసుకురావడం మాత్రమే సీక్వెల్‌కు సరిపోదన్నది ఆయన అభిప్రాయంగా తెలుస్తోంది.అయితే ‘జైలర్’ ముగింపులోనే మరో కథకు అవసరమైన అంశాలు కనిపించడంతో ఈ సినిమాకు మాత్రం ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కేవలం తొలి భాగం విజయాన్ని దృష్టిలో పెట్టుకుని కాకుండా, కథను సహజంగా కొనసాగించగల అవకాశమే తన నిర్ణయానికి ప్రధాన కారణమని వివరించారు.భారీ అంచనాల మధ్య ‘జైలర్ 2’నెల్సన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రజనీకాంత్ మరోసారి టైగర్ ముత్తువేల్ పాండియన్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పాత నటీనటులతో పాటు పలువురు కొత్తవారు కూడా భాగమయ్యారు. రజనీ అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# గార్డెన్‌లో శ్రీలీల ఫొటోషూట్!

మహా : టాలీవుడ్‌లో తనదైన నటన, చురుకైన డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న కథానాయిక శ్రీలీల మరోసారి తన ప్రత్యేక ఫొటోషూట్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. పచ్చని తోటలో కుందేళ్లతో కలిసి కనిపించిన ఆమె ఫొటోలు ప్రస్తుతం సినీ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. లేత నీలిరంగు దుస్తుల్లో కనిపించిన శ్రీలీల ఈ ఫొటోషూట్‌లో ఎంతో సహజంగా మెరిశారు. పచ్చిక బయళ్ల మధ్య తెల్లని కుందేళ్లతో సరదాగా గడుపుతూ కెమెరాకు పోజులిచ్చారు. పూలతో అలంకరించిన హెయిర్‌స్టైల్, సింపుల్ మేకప్, సౌకర్యవంతమైన దుస్తులు ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హడావుడి లేని ప్రకృతి వాతావరణంలో రూపొందించిన ఈ ఫొటోలు ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. సాధారణంగా తెరపై ఎనర్జిటిక్ డ్యాన్స్‌లు, గ్లామరస్ పాత్రలతో కనిపించే శ్రీలీల.. ఈసారి మాత్రం సున్నితమైన, సహజమైన లుక్‌తో ఆకట్టుకున్నారు. కుందేళ్లతో ఆమె గడిపిన క్షణాలు ఫొటోలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. కన్నడ చిత్రం ‘కిస్’తో నటిగా పరిచయమైన శ్రీలీల.. ‘పెళ్లిసందD’ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువయ్యారు. ఆ తర్వాత ‘ధమాకా’, ‘భగవంత్ కేసరి’, ‘స్కంద’, ‘గుంటూరు కారం’ వంటి చిత్రాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. నటనతో పాటు డ్యాన్స్‌లోనూ ప్రత్యేక ప్రతిభ చూపుతూ యువ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ సంపాదించారు. తెరపై విభిన్న పాత్రలు పోషిస్తూ ముందుకు సాగుతున్న ఈ కథానాయిక.. ఫొటోషూట్లతోనూ తన స్టైల్‌లో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గార్డెన్ నేపథ్యంలో కుందేళ్లతో కలిసి చేసిన ఈ ఫొటోషూట్ ఆమె అభిమానులకు మరో ఆసక్తికరమైన విజువల్ ట్రీట్‌గా నిలుస్తోంది.





# శైలపుత్రి అమ్మవారి రూపంలో వితిక షేరు..

**నవరాత్రి వేళ సంప్రదాయ అలంకరణలో నటి.. ఆధ్యాత్మిక శోభను ప్రతిబింబించే చిత్రాలు**

మహా :తెలుగు నటి వితిక షేరు ప్రత్యేక అలంకరణలో కనిపిస్తూ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. నవరాత్రి సందర్భంగా దుర్గాదేవి తొలి రూపమైన మా శైలపుత్రిని ప్రతిబింబించేలా రూపొందించిన ఫొటోషూట్ ఈ చిత్రాలకు ప్రత్యేకతను తీసుకొచ్చింది. భారతీయ సంప్రదాయాలు, పండుగల విశిష్టతను ప్రతిబింబించే ఇటువంటి ఫొటోషూట్లు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతుంటాయి. అమ్మవారి అలంకరణకు సంబంధించిన రంగులు, ఆభరణాలు, సంప్రదాయ వస్త్రధారణ ఫొటోలకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందిస్తాయి. వితిక షేరు ఈ ప్రత్యేక రూపంలో కనిపించడం ద్వారా పండుగ వేళ సంప్రదాయ సౌందర్యానికి ప్రాధాన్యం ఇచ్చినట్లుగా ఉంది. నవరాత్రుల్లో దుర్గాదేవిని తొమ్మిది రూపాల్లో ఆరాధించడం హిందూ సంప్రదాయంలో విశిష్టమైనది. తొలి రోజున పూజలందుకునే శైలపుత్రి అమ్మవారు శక్తి, ప్రకృతి, స్థిరత్వానికి ప్రతీకగా భావిస్తారు. అందుకే ఈ రూపానికి సంబంధించిన అలంకరణలు, ఆధ్యాత్మిక చిత్రాలు భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. నటి వితిక షేరు సినిమాలతో పాటు బుల్లితెర ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. ముఖ్యంగా ‘బిగ్‌బాస్ తెలుగు 3’లో పాల్గొని తన వ్యక్తిత్వంతో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. సంప్రదాయ దుస్తులు, ప్రత్యేక ఫొటోషూట్లతోనూ ఆమె అభిమానులను పలకరిస్తుంటారు. నవరాత్రి నేపథ్యంలో రూపొందించిన ఈ ఫొటోషూట్ సినీ అభిమానులతో పాటు సంప్రదాయ అలంకరణలను ఇష్టపడేవారికీ ఆసక్తికరంగా నిలుస్తోంది.

# రామ్‌చరణ్–సుకుమార్ సినిమాకు అనిరుధ్ మ్యూజిక్?

**డీఎస్పీ స్థానంలో కొత్త స్వరం.. టాలీవుడ్‌లో ఆసక్తికర చర్చ!**



**హైదరాబాద్, మహా** : మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కలయికలో తెరకెక్కనున్న కొత్త సినిమాపై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తోంది. ‘రంగస్థలం’ వంటి భారీ విజయవంతమైన చిత్రం తర్వాత వీరిద్దరూ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ పేరు తెరపైకి రావడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. డీఎస్పీతో సుకుమార్‌ది ప్రత్యేక అనుబంధందర్శకుడు సుకుమార్ సినిమాల గురించి మాట్లాడితే సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ పేరు తప్పకుండా గుర్తుకొస్తుంది. ‘ఆర్య’, ‘జగడం’, ‘ఆర్య 2’, ‘1: నేనొక్కడినే’, ‘నాన్నకు ప్రేమతో’, ‘రంగస్థలం’, ‘పుష్ప’ చిత్రాలతో వీరిద్దరి కలయిక ప్రేక్షకులకు ఎన్నో గుర్తుండిపోయే పాటలను అందించింది. కథలోని భావోద్వేగాలకు అనుగుణంగా సంగీతాన్ని మలచడంలో ఈ కాంబినేషన్ ప్రత్యేక గుర్తింపు సంపాదించింది.అలాంటి విజయవంతమైన కలయికలో ఇప్పుడు మార్పు రావచ్చనే ప్రచారం ఆసక్తిని పెంచుతోంది. రామ్‌చరణ్-సుకుమార్ కొత్త చిత్రానికి అనిరుధ్ సంగీతం అందించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది. ప్రస్తుతం దక్షిణాది చిత్రసీమలో అనిరుధ్ రవిచందర్ ప్రముఖ సంగీత దర్శకుల్లో ఒకరిగా కొనసాగుతున్నారు. వేగవంతమైన బీట్స్, ఆకట్టుకునే నేపథ్య సంగీతంతో భారీ చిత్రాలకు ప్రత్యేక ఉత్సాహాన్ని తీసుకొస్తున్నారు. ఆయన సంగీతం రామ్‌చరణ్ మాస్ ఇమేజ్‌కు, సుకుమార్ కథా శైలికి తోడైతే తెరపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే ఆసక్తి అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో మరో సంగీత దర్శకుడిని ఎంపిక చేస్తారనే వార్తపై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. సుకుమార్-డీఎస్పీ కలయిక కొనసాగాలని కొందరు అభిమానులు కోరుకుంటుండగా, కొత్త కాంబినేషన్ ద్వారా భిన్నమైన సంగీతాన్ని ఆస్వాదించవచ్చని మరికొందరు భావిస్తున్నారు.



# పిల్లల కోసమే సల్మాన్ ఖాన్ యూట్యూబ్ ఛానల్!

**వినోదంతో పాటు విద్య.. కొత్త ప్రయత్నం వెనుక అసలు ఉద్దేశం ఇదే!**

మహా: బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ డిజిటల్ ప్రపంచంలో మరో అడుగు వేశారు. తాజాగా తన అధికారిక యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించిన ఆయన.. అందులో వచ్చే కంటెంట్ ఎవరిని లక్ష్యంగా చేసుకుని రూపొందిస్తున్నారో స్పష్టం చేశారు. పెద్దల కోసం కాకుండా చిన్నారులను దృష్టిలో పెట్టుకుని ఈ వీడియోలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. సల్మాన్ ఖాన్ తన కొత్త యూట్యూబ్ ఛానల్ ‘బీయింగ్ సల్మాన్ ఖాన్’ ద్వారా ప్రేక్షకులకు భిన్నమైన అనుభూతిని అందించాలని భావిస్తున్నారు. ఈ ఛానల్‌లోని వీడియోలు పెద్దలకు అంతగా నచ్చకపోవచ్చని, అయితే పిల్లలకు ఉపయోగపడేలా రూపొందిస్తున్నామని ఆయన సోషల్ మీడియా వేదికగా వివరించారు.వినోదంతో పాటు ప్రేమ, కుటుంబ విలువలు, విద్యకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పిల్లలు సరదాగా నేర్చుకునేలా కంటెంట్ ఉండాలన్నదే ఈ ప్రయత్నం వెనుక ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది.ఈ ఛానల్‌లో సల్మాన్ ఖాన్ తనకు అలవాటైన తెరపాత్రలకు భిన్నంగా కనిపిస్తున్నారు. నటనలోని మెళకువలు, శరీర భాష, సంభాషణలు పలికే విధానం వంటి అంశాలను సరదాగా నేర్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఒకవైపు అనుభవజ్ఞుడైన నటుడిగా, మరోవైపు నేర్చుకునే విద్యార్థిలా కనిపిస్తూ వీడియోలను ఆసక్తికరంగా మలుస్తున్నారు.సినిమాల్లో తనదైన శైలితో అభిమానులను అలరించే సల్మాన్.. ఇప్పుడు అదే ఇమేజ్‌ను పిల్లలకు ఉపయోగపడే కంటెంట్‌గా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. సాధారణ సెలబ్రిటీ ఛానళ్లకు భిన్నంగా ఈ ప్రయోగం సాగుతుండటం విశేషం.డిజిటల్ రంగంలో మరో అడుగుసల్మాన్ ఖాన్‌కు ఇప్పటికే సినిమాలు, టెలివిజన్, సంగీతం వంటి విభాగాల్లో మంచి గుర్తింపు ఉంది. ఇప్పుడు యూట్యూబ్ ద్వారా నేరుగా ప్రేక్షకులతో అనుసంధానమయ్యే కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ఈ ఛానల్ ద్వారా భవిష్యత్తులో ఎలాంటి వీడియోలు అందిస్తారనేది ఆసక్తికరంగా మారింది.వినోదం మాత్రమే కాకుండా పిల్లలకు విద్య, కుటుంబ విలువల ప్రాధాన్యాన్ని తెలియజేయాలన్న సల్మాన్ ఆలోచనకు ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన లభిస్తుందో చూడాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com